# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

22.2.2026 ఆదివారం sunday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 219 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



## రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789


## పత్తి రైతులకు ఊరట



- నెలాఖరు వరకు కొనుగోళ్ల పొడిగింపు
- రాష్ట్ర ప్రభుత్వ విన్నపానికి సానుకూల స్పందన.. సీసీఐ కీలక నిర్ణయం
- కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు మంత్రి తుమ్మల కృతజ్ఞతలు

2



## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాసరెడ్డి

.. వివరాలు 3లో

## అవినీతి నిరూపిస్తే వెంటనే రాజీనామా

- ప్రజలకు ఎవరేంటో తెలుసు
- తనపై దాడి చేసేందుకు షబ్బీర్ కుట్ర
- ఇక ప్రజల్లో ఉంటే తేల్చుకుంటా
- తనకేదైనా జరిగితే సిఎం రేవంత్‌దే బాధ్యత
- కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హెచ్చరిక

3

కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను అవినీతిలో కింగ్ అన్నారని.. తనపై ఏ ఒక్క అవినీతి బయటపడినా స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు.





3

## కామారెడ్డి ఎమ్మెల్యే ఆఫీస్ ముట్టడి

కాంగ్రెస్ కార్యకర్తల దాడితో ఉద్రిక్తత

పరస్పరం బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల దాడి

రంగంలోకి పోలీసులు.. అదుపులో పరిస్థితి

## ఎదుగుదలకు తొలిమెట్టు డీసీసీ పదవి



### కాంగ్రెస్‌లో 'మెరిట్' ఉన్నవారికే పదవులు

- భిన్నాభిప్రాయాలు కార్యకర్తల స్థైర్యాన్ని దెబ్బతీస్తాయి
- అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- ఏపీలో షర్మిల కృషి ఆదర్శనీయం..
- వికారాబాద్‌లో రెండు రాష్ట్రాల నేతల శిక్షణ తరగతులు
- డీసీసీ అధ్యక్షుల శిక్షణలో సీఎం రేవంత్ రెడ్డి

> కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు ఉంటుందని, పదవుల కేటాయింపులో కేవలం 'మెరిట్ లిస్ట్' మాత్రమే ప్రామాణికమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం వికారాబాద్ జిల్లా అనంతగిరిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన డీసీసీ అధ్యక్షుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. డీసీసీ అధ్యక్ష పదవి నాయకుల రాజకీయ ఎదుగుదలకు తొలిమెట్టు అని, ఈ అవకాశాన్ని దుర్వినియోగం చేయవద్దని సూచించారు.

**వికారాబాద్, ఫిబ్రవరి 21:** భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గాంధీ సిద్ధాంతాలను విశ్వసించే పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. రిజర్వేషన్లను రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని విమర్శించారు. రెండు తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమాన్ని రేవంత్‌రెడ్డి శనివారం వికారాబాద్ జిల్లా అనంతగిరిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఈ శిక్షణ డీసీసీ అధ్యక్షులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వారి అవకాశాలను మెరుగు పరుచుకునేందుకు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీ విధానాలు, ప్రజల సమస్యలపై చర్చించేందుకు ఈ తరగతులు సహాయ పడతాయన్నారు. గాంధీజీపై లాఠీలు ఎత్తడానికి బ్రిటిషర్లు భయపడ్డారని, దేశభక్తులమని అనుకునే కొందరు తూటాలతో గాంధీని చంపారని విమర్శించారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయని, గాంధీ ఆలోచనలపై కూడా భిన్నాభిప్రాయాలు చెప్పినవారు ఉన్నారన్నారు. 'భిన్నాభిప్రాయాలు చెప్పిన వారిని తరిమేస్తే మనకే నష్టం.. అందరూ కలిసి పనిచేస్తే అనుకున్నది సాధించవచ్చు' అని రేవంత్ అన్నారు.

మిగతా 2 లో



## 'ముఠా'కు నిరుద్యోగులే 'టార్గెట్'!

5

'సైబర్ ఫ్రాడ్ ఏజెంట్ల గ్యాంగ్' గుట్టురట్టు

జగిత్యాలలో తీగలాగితే 'లావోస్'లో కదిలిన డొంక!

చైనా కంపెనీ ఆధ్వర్యంలోని 'కాల్ సెంటర్'లలో జాబ్స్‌అని మోసం

అమెరికాలోని 'భారతీయులే' వీరి లక్ష్యం

థాయిలాండ్ సరిహద్దుల్లో అక్రమ తరలింపు..

చైనా టీమ్ లీడర్లు, ఫేక్ ప్రొఫైల్స్..

'అంతర్జాతీయ మోసాల గ్యాంగ్'పై జగిత్యాల పోలీసుల జబర్దస్త్ ఆపరేషన్



## గ్రామీణ ప్రాంతాల్లో 12 ఏళ్లుగా ఇల్లు లేదు

- కనీసం ఈ ఏడాదిలో 3 లక్షల ఇండ్లు మంజూరు చేయండి
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి పొంగులేటి విజ్ఞప్తి

3

## దేశం నుంచి చొరబాటుదార్లను తరిమేస్తాం



- ఓటరు జాబితాతో పాటు, దేశంలోనూ స్థానం లేకుండా చేస్తాం
- కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా హెచ్చరిక

2

## పసి పిల్లలపై లైంగిక దాడులు

- 33 మంది బాలలకు నరకం చూపిన దంపతులు
- మరణశిక్ష విధించిన సీబీఐ కోర్టు





2



బాలురపై లైంగిక దాడులకు పాల్పడి, ఆ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టిన ఓ జంటకు ఉత్తరప్రదేశ్‌లోని బాందాలో ఉన్న ప్రత్యేక కోర్టు మరణ శిక్ష విధించింది. నీటిపారుదల శాఖలో జూనియర్ ఇంజినీరుగా పనిచేసిన రామ్‌భావన్, అతడి భార్య దుర్గావతికి ఈ శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు తీర్పు చెప్పింది. 2010-2020 మధ్య పలు జిల్లాల్లో 33 మంది బాలురపై వీరు అత్యాచారం చేసినట్టు రుజువయింది. బాధితుల్లో మూడేళ్ల బాబు కూడా ఉన్నాడు.

## ఢిల్లీ ఉగ్రకుట్రకు లష్కరే ప్లాన్

- ఆలయాలే లక్ష్యంగా దాడికి స్కెచ్
- నిఘా వర్గాల హెచ్చరికలు జారీ
- ఇతర నగరాల్లోనూ పేలుళ్లకు కుట్ర
- హైదరాబాద్‌లో ముగ్గురు అరెస్ట్



4



# పసి పిల్లలపై లైంగిక దాడులు

## 33 మంది బాలలకు నరకం చూపిన దంపతులు

### మరణశిక్ష విధించిన సీబీఐ కోర్టు

**లక్నో, ఫిబ్రవరి 21:** అభంశుభం తెలియని పసి పిల్లలపై కొందరు మానవ మృగాలు లైంగిక వేధింపులకు పాల్పడ్డ కేసులో దంపతులకుమరణశిక్ష పడింది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారికి కోర్టులు సైతం కఠిన శిక్షలు విధిస్తున్నాయి. తాజాగా ఇలాంటి ఓ కేసు విషయంలో దంపతులకు మరణశిక్ష పడింది. పదేళ్లలో 33 మంది బాలురపై లైంగిక దాడికి పాల్పడటంతో పాటు, ఆ దృశ్యాలను చిత్రీకరించి విదేశాలకు పంపించిన ఈ నరరూప రాక్షస దంపతులకు సరైన శిక్షపడింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రామ్ భవాన్.. చిత్రకూట్ జిల్లాలో గతంలో నీటిపారుదల శాఖలో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో తన భార్య దుర్గావతితో కలిసి 2010-2020 మధ్య.. బందా, చిత్రకూట్ ప్రాంతాల్లో బాలురపై లైంగిక దాడులకు పాల్పడ్డాడు. వీరి దారుణాలకు బలైన వారిలో మూడేళ్ల వయసు చిన్నారులు కూడా ఉన్నారు. ఆన్‌లైన్ వీడియో గేమ్స్, బహుమతులు, తినుబండారాల పేరుతో పిల్లలను మభ్యపెట్టి ఇంటికి రప్పించి ఈ దారుణాలకు ఒడిగట్టారు. ఈ దంపతుల దారుణాలకు సంబంధించిన 2 లక్షల వీడియోలు, ఫొటోలను ఇంటర్నెట్ ద్వారా 47 దేశాలకు పంపించారు. నిందితులపై సీబీఐ 2020 అక్టోబరులో కేసు నమోదు చేసింది. మైనర్ బాధితుల పట్ల సీబీఐ దర్యాప్తు సున్నితంగానే కొనసాగింది. రామ్ భవాన్, అతడి భార్యపై 2021 ఫిబ్రవరిలో సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఆ దంపతుల నుంచి ప్రాణాలతో బయటపడిన పిల్లల్లో కొందరి ప్రైవేట్ భాగాలపై గాయాలు అయ్యాయని, వారిలో కొందరు ఏళ్ల తరబడి ఆసుపత్రులలో చికిత్స తీసుకోవాల్సి వచ్చిందని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఐదేళ్ల పాటు యూపీలోని పోక్సో కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. తాజాగా కోర్టు తుది తీర్పును వెల్లడించింది. దీన్ని అత్యంత అరుదైన కేసుగా పోక్సో కోర్టు అభివర్ణించింది. ఈ కేసులో నిందితులైన మాజీ ఇంజినీరు దంపతులకు మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. అలానే బాధితులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# 1,100 ఫైల్స్ దగ్ధం

## డేటా రికవరీ చేయడం కష్టం.. కేసుల దర్యాప్తులో ఎఫ్ఎస్ఎల్ ముఖ్యం

### నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్ ఘటనపై ప్రత్యేక బృందం

**ములుగు, ఫిబ్రవరి 21:** నాంపల్లి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో ఇటీవల జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఘటనలో మొత్తం 1,100 ఫైల్స్ దగ్ధం అయినట్లు నాగ్‌పూర్ నుంచి వచ్చిన స్పెషల్ టీం గుర్తించింది. ఈ దగ్ధమైన ఫైల్స్‌లోని డేటా రికవరీ కోసం ఆ బృందం ఎంతో తీవ్రంగా ప్రయత్నించింది. తాజాగా ఈ ఫైల్స్‌లోని డేటా రికవరీ చేయడం కష్టమని ప్రత్యేక బృందం తేల్చి చెప్పింది. ఈ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో వివిధ కేసుల దర్యాప్తులో ఎఫ్ఎస్ఎల్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో వెంట్రుకలు, ఎలక్ట్రానిక్ డివైజ్‌ల విశ్లేషణ, రక్తం, వేలిముద్రలు, బుల్లెట్లు, లేదా డీఎన్ఏ నమూనాలు, ఆయుధాలు, డాక్యుమెంట్లు ఫోర్జరీ జరిగాయా లేదా ప్రతీది ఇతర అన్ని ఆధారాలను ల్యాబ్‌లోనే పరిశీలించి నివేదికలు సిద్ధం చేస్తారు. ఈ ఆధారాలు ఎన్నో కోర్టు తీర్పుల్లో కీలకంగా ఉంటాయి. కానీ ఈ ప్రమాద ప్రభావం వల్ల కేసుల దర్యాప్తుపై ఎంత వరకు పడనుందనేది ఆందోళనకరమైన విషయం.

# ఓపెన్ టెన్త్, ఇంటర్ షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 :** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2026 సంవత్సరానికిగానూ 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల టైమ్‌టేబుల్‌ను విడుదల చేసింది. పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు ఇప్పుడు పూర్తి షెడ్యూల్‌ను చూసుకోవాలని సూచించింది. షెడ్యూల్‌ను పూర్తిగా తేదీల వారీగా పరిశీలించుకోవాలని పేర్కొన్నది. తాజా టైమ్‌టేబుల్ ప్రకారం.. పదో తరగతి, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు ఏప్రిల్ 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో జరగనున్నాయి. ఉదయం షిఫ్ట్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సాగనుంది. ఆ తర్వాత ఏప్రిల్ 28 నుంచి మే 5వ తేదీ వరకు ఇంటర్నల్స్, ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి.

# విద్యార్థులకు పోలీస్ శాఖ ఇంటర్న్‌షిప్

**హైదరాబాద్,ఫిబ్రవరి21:** హైదరాబాద్ సిటీ పోలీసులు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. డేటా అనాలసిస్, రీసెర్చ్ ప్రాజెక్టులు, ఆధునిక పోలీసింగ్‌లో విద్యార్థులను భాగస్వాములను చేయాలన్న లక్ష్యంతో.. 25 ఏళ్లలోపు డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించనున్నారు. ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన వారికి అధికారిక ధ్రువపత్రాలు ఇవ్వనున్నారు. ఎస్ఎమ్ఐటీ సెల్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించ బోతున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని సూచించారు.

# విద్యుత్ సంస్థ నియామకాల్లో బీసీ రిజర్వేషన్ల ఉల్లంఘన

## మార్చి 4న నేరుగా పరిశీలించాలని కమిషన్ నిర్ణయం

**హైదరాబాద్,ఫిబ్రవరి21 :** రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యుత్ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎన్‌పీడీసీఎల్ మరియు ఎస్‌పీడీసీఎల్ సంస్థల నియామకాలలో రిజర్వేషన్ల ఉల్లంఘన జరుగుతుందని తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం బిసి కమిషన్ దృష్టికి తీసుకువచ్చింది. ఈ అంశంపై కమిషన్ సుదీర్ఘంగా చర్చించింది. ఇందులో భాగంగా మార్చి 4వ వారంలో విద్యుత్ సంస్థల కార్యాలయాలను సందర్శించి ఈ విషయంపై విచారణ నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. మరోవైపు రాష్ట్రంలోని విద్యార్థుల వివరాల సేకరణ వేగవంతం చేయాలని కమిషన్ అధికారులకు సూచించింది. రాష్ట్ర బీసీ కమిషన్ సమావేశం శనివారం ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ జి. నిరంజన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, కమిషన్ మెంబర్ సెక్రెటరీ బాల మాయ దేవి, పాల్గొన్నారు. ఈ సమావేశంలో అధికారులు డిప్యూటి డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్ హాజరయ్యారు. సమావేశంలో కమిషన్ వివిధ అంశాలపై చర్చించింది.

# ఎదుగుదలకు తొలిమెట్టు డీసీసీ పదవి

మొదటి పేజీ తరువాయి

పార్టీలో ఏ లిస్టులకు చోటు లేదు.. కేవలం మెరిట్ లిస్టు ప్రకారమే అవకాశాలు వస్తాయి. డీసీసీ పదవి ఎంతో విలువైనది.. వచ్చిన అవకాశం దుర్వినియోగం చేసుకోవద్దు. డీసీసీ నుంచి పీసీసీ కావొచ్చు. ఎమ్మెల్యే కావొచ్చు.. ఎంపీ కావొచ్చు.. సీఎం కావొచ్చని రేవంత్ రెడ్డి అన్నారు.రెండున్నర శాతం ఓట్ల నుంచి 40 శాతం వరకు కాంగ్రెస్ పార్టీని తీసుకొచ్చామన్నారు. డిజిటల్ మెంబర్‌షిప్‌పై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్‌లో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసినవాళ్లమవుతామన్నారు. ఎన్నికలకు సమగ్ర సన్నద్ధత, ప్రజలతో అనుసంధానమే లక్ష్యంగా తెలంగాణ, ఏపీకి చెందిన డీసీసీ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం రూ.వేల కోట్ల ఆస్తులను త్యాగం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారు. పార్టీలో అందరి పనితీరు మీద




నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్నవారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ బాధ్యతలు తీసుకున్న వారిని వెతికి మరీ పదవులు ఇచ్చామని సీఎం చెప్పుకొచ్చారు. నాయకుల ప్రతీ కదలికను గమనిస్తూనే ఉంటామని.. మెరిట్ కోటా తప్ప కాంగ్రెస్‌లో ఏ కోటా లేదని స్పష్టం చేశారు. మెరిట్ కోటాలో పాస్ అయితేనే పదవులు వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి చాలా విలువైనదని.. ఈ పదవిని దుర్వినియోగం చేస్తే దేవుడు కూడా కాపాడలేడన్నారు. 'డీసీసీ అధ్యక్ష పదవి మీ ఉన్నతికి తొలిమెట్టు' అని పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనాయకులను అవమానపరచాలని బీజేపీ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీకి ఉండడానికి సొంత ఇల్లు కూడా లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలపై సీఎం రేవంత్ రెడ్డి పొగడ్తల వర్షం కురిపించారు. రాజకీయ వారసత్వం నుంచి షర్మిల వచ్చినా ఆమె అవకాశాలను తీసుకోలేదన్నారు. ముళ్లబాటలో కూడా ఏపీలో కాంగ్రెస్ కోసం షర్మిల కష్టపడుతున్నారని తెలిపారు. ప్రజల దగ్గరికి వెళ్ళి రాజకీయాల్లో రాణించాలని షర్మిల చేస్తున్న కృషిని ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కాగా, డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరయ్యారు. అలాగే, రెండు రాష్ట్రాల నుంచి సుమారు 70 మంది డీసీసీ అధ్యక్షులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు

# పత్తి రైతులకు ఊరట

## నెలాఖరు వరకు కొనుగోళ్లు పొడిగింపు

**హైదరాబాద్,ఫిబ్రవరి 21:** రాష్ట్రంలో ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగనున్న పత్తి కొనుగోళ్లు కొనసాగుతాయని, ఈ అవకాశాన్ని పత్తిరైతులు వినియోగించుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. తమ అభ్యర్థన మేరకు పత్తి కొనుగోళ్లను ఫిబ్రవరి నెలాఖరు వరకు సీసీఐ పొడిగించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల గడువును పొడిగించాలని ఇప్పటికే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లను కోరినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. పొడిగించిన గడువును వినియోగించుకొని పత్తిని అమ్ముకోవాలని పత్తి రైతులను మంత్రి తుమ్మల కోరారు.రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు, రాష్ట్రంలోని పత్తి రైతులకు ఇబ్బంది కలగకుండా, ఫిబ్రవరి నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లను కొనసాగించాలని సీసీఐ అంగీకరించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. రైతుల ప్రయోజనాలను ప్రాధాన్యంగా తీసుకొని కొనుగోళ్ల గడువును పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం మరియు సీసీఐ దృష్టికి తీసుకెళ్లగా, వారు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో పత్తి సాగు ఆలస్యంగా ప్రారంభమవడంతో దిగుబడులు కూడా ఆలస్యంగా మార్కెట్‌కు వస్తున్నాయి. ఈ వాస్తవ పరిస్థితిని కేంద్రానికి వివరిస్తూ కొనుగోళ్ల గడువును పొడిగించాలని మంత్రి గారు కోరారు. అలాగే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తో రాష్ట్ర పరిస్థితిని వివరించి, రైతులకు నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఈ సంవత్సరం 45.32 లక్షల ఎకరాలలో పత్తిని సాగు చేయగా, 28.29 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా వేయడం జరిగింది. ఇప్పటివరకు 8,80,053 మంది రైతుల నుంచి రూ.12,823 కోట్ల విలువైన 16.15 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. అదేవిధంగా ఇప్పటివరకు మార్కెట్ ద్వారా 2.24 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యత ప్రమాణాలు లేని పత్తిని కోనుగోలు చేయడం జరిగింది. అయినప్పటికీ రాష్ట్రంలో ఇంకా 9.99 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి రైతుల వద్ద ఉందని మార్కెటింగ్ అధికారులు అంచనా వేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం కొత్తగా తీసుకొచ్చిన కపాస్ కిసాన్ పై మొదట రైతులు మరియు జిన్నర్ల నుండి వ్యతిరేకత వచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తూ, రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన యాప్ కి రాష్ట్ర ప్రభుత్వం సపోర్టు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దీంతో ఈ యాప్ ద్వారా రైతులు క్యూలలో నిలబడే అవకాశం లేకుండా, సమయపాలన పాటిస్తూ, రైతులకు దగ్గరలోని పత్తి కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించుకునే అవకాశం కలగడంతో పాటు, పత్తి కొనుగోళ్లను రెగ్యులేట్ చేస్తూ, పారదర్శకంగా కొనుగోళ్లను చేపట్టే వెసులుబాటు కలిగిందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో రైతులకు సమయానికి ఎరువుల పంపిణీకి తమ సర్కారు మొబైల్ యూరియా బుకింగ్ యాప్ ని తీసుకొచ్చిందన్నారు. తద్వారా యూరియా బ్లాక్ మార్కెటింగ్ అరికట్టడంతో పాటు అధిక నిల్వలను నియంత్రిస్తూ పారదర్శక పంపిణీ వ్యవస్థ అమల్లోకి వచ్చిందన్నారు. పంట పూర్తిగా మార్కెట్‌కు రాకముందే సీసీఐ వారు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తారనే సమాచారంతో రైతుల్లో ఆందోళన నెలకొందని, నాణ్యమైన పత్తిని ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందనే భయం రైతుల్లో ఉన్న నేపథ్యంలో, మరో 30 రోజులు కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని మంత్రి తుమ్మల సీసీఐను ప్రత్యేకంగా కోరారు. రాష్ట్రంలోని ప్రతి పత్తి రైతు తన పంటను పూర్తిగా విక్రయించే వరకు కొనుగోలు కేంద్రాలను తెరిచి ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు సీసీఐ సీఎండీ శ్రీ లలిత్ కుమార్ గుప్తా మరియు కేంద్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ కుమార్‌లకు మంత్రి ఆదేశాలతో వ్యవసాయశాఖ సెక్రటరీ లేఖ రాశారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనుగోళ్ల గడువు పొడిగించడంతో రైతులకు ఉపశమనం లభించిందని మంత్రి తెలిపారు. పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకొని రైతులు సమీపంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకువచ్చి మద్దతు ధరకు విక్రయించుకోవాలని మంత్రి కోరారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

# గ్రామీణ ప్రాంతాల్లో 12 ఏళ్లుగా ఇల్లు లేదు

- కనీసం ఈ ఏడాదిలో 3 లక్షల ఇండ్లు మంజూరు చేయండి
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి పొంగులేటి విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** తెలంగాణలో గత 12 ఏళ్లుగా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదల గృహ నిర్మాణం నిలిచిపోయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పెండింగ్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలో 3 లక్షల ఇండ్లు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆయనను మంత్రి పొంగులేటి ప్రత్యేకంగా కలుసుకుని వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో గృహ నిర్మాణానికి సంబంధించిన పరిస్థితులను వివరించారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, 2014-23 మధ్య కాలంలో గత ప్రభుత్వం గ్రామీణ పేదల



ఇండ్ల నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. పదేళ్లలో కేంద్రం నుంచి ఒక్క ఇల్లు కూడా తీసుకోలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తమ ప్రభుత్వం పేదల గృహ నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుందని చెప్పారు. రాబోయే మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే ఈ ఏడాది దాదాపు నాలుగు లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కేంద్రం సహకరిస్తే ఈ కార్యక్రమం మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. తెలంగాణ గతంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ) 1.0లో భాగస్వామ్యం కాలేదని, అయితే 2023 తర్వాత 2.0లో అధికారికంగా చేరిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి సర్వేలో 11.57 లక్షల అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఏర్పడిన పెండింగ్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది 3 లక్షలు, వచ్చే ఏడాది మరో 2 లక్షల ఇండ్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని అభ్యర్థించారు. పేద కుటుంబాలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసం కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, పేదల సొంతింటి కలను నెరవేర్చడంలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందని మంత్రి పొంగులేటి ఆశాభావం వ్యక్తం చేశారు.

# దేశం నుంచి చొరబాటుదార్లను తరిమేస్తాం

- ఓటరు జాబితాతో పాటు, దేశంలోనూ స్థానం లేకుండా చేస్తాం
- కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా

**గౌహతి, ఫిబ్రవరి 21:** నక్సలిజం నుంచి దేశం విముక్తి పొందుతున్నట్లే.. చొరబాటుదారులను ఏరివేయడం కూడా సాధ్యమేనని కేంద్ర మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. అక్రమ వలసదారులను కేవలం ఓటర్ల జాబితా నుంచే కాకుండా.. దేశం నుంచే తొలగిస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో ఈ పనిని పూర్తి చేస్తామని చెప్పారు. అస్సాంలోని కామ్‌రూప్‌లో పోలీస్ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఓ సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. చొరబాటుదారుల ఆక్రమణల నుంచి విడిపించిన స్థలంలోనే ఈ కొత్త క్యాంపస్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు.చొరబాటుదారులను వారు ఆక్రమించిన స్థలాల నుంచి తరిమికొట్టినంత మాత్రాన సమస్య తీరిపోదు. వారు మరోచోట స్థిరపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారిని మొత్తంగా దేశం నుంచే బయటకు పంపించాలి. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. కానీ.. కాంగ్రెస్ ఆ పని చేయబోదు. ఎందుకంటే వారే ఆ పార్టీకి ఓటు బ్యాంకు' అని అమిత్ షా ఆరోపించారు. చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు.. అస్సాంకు ముప్పుగా మారాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటే.. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని సవాల్ విసిరారు.రానున్న ఐదేళ్లలో ఈశాన్య భారతంలో అస్సాం పారిశ్రామిక కేంద్రంగా మారుతుందని అమిత్ షా చెప్పారు. అనంతరం గువాహటిలో నిర్వహించిన సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో పాల్గొన్నారు. శౌర్యపరాక్రమాలు, దేశభక్తిలో



అందరికీ ఆదర్శంగా సీఆర్పీఎఫ్ నిలుస్తోందని పేర్కొన్నారు.

# అవినీతి నిరూపిస్తే వెంటనే రాజీనామా

- ప్రజలకు ఎవరేంటో తెలుసు
- తనపై దాడి చేసేందుకు షబ్బీర్ కుట్ర
- ఇక ప్రజల్లో ఉంటే తేల్చుకుంటా
- తనకేదైనా జరిగితే సిఎందే బాధ్యత
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హెచ్చరిక



**కామారెడ్డి, ఫిబ్రవరి 21:** కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను అవినీతిలో కింగ్ అన్నారని.. తనపై ఏ ఒక్క అవినీతి బయటపడినా స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. కామారెడ్డిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డి ఓడిపోయిన కామారెడ్డిలో షబ్బీర్ అలీ అన్నీ తానే అంటున్నారని చెప్పుకొచ్చారు. తనను కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్, జడ్పీటీసీ చేశామని అన్నారని.. ఆయన కామారెడ్డికి చేసిందేమీ లేదని విమర్శించారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన అవకాశంతో తాను కాంగ్రెస్ నుంచి గతంలో గెలిచానని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి ప్రస్తావించారు. 'వైఎస్ రాజశేఖర్ రెడ్డి నా రాజకీయ గురువు. నువ్వు మా తండ్రి వద్ద చేతులు కట్టుకుని నిలబడ్డావ్. నువ్వు కట్టిన ఐదు అంతస్తుల భవనానికి మున్సిపల్ అనుమతి లేదు. ఈ నియోజకవర్గం నీ సొంతం కాదు. నీవల్లే నేను కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చాను. అసెంబ్లీలో హుందాగా ఉండాలని మాట్లాడిన నన్ను ఇలా చీప్‌గా మాట్లాడేలా చేశారు. నాపై నిందలేస్తే ఎలా ఉంటుందో ఈ రోజు చూశారు. ఇది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది. నాపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేశా. మా వాళ్లు ఎవరూ రావద్దని నేను చెబితే మీరు వేలాదిగా తరలిరావాలని మెసేజ్‌లు పెట్టారు. రేపటి నుంచి గ్రామాలకు వస్తా, ఎవరు అడ్డుకుంటారో చూస్తా. బాన్సువాడలో గొడవ జరిగితే మేం మాట్లాడి సద్దుమణిగేలా చేశాం' అని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి తెలిపారు. 263 ఎకరాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎలాంటి అక్రమాలు లేవు. నేను ఒక్క గజం అమ్మినా నిరూపించాలని వెంకటరమణా రెడ్డి సవాల్ విసిరారు. 'దొంగలెవరో ప్రజలకు తెలుసు. నాకేం జరిగినా సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత. రేపటి నుంచి యుద్ధమే. ఇది సీఎంకు, నాకూ మధ్య యుద్ధం. కలెక్టర్ వద్ద కూర్చుందాం. కాలేజీ కమిటీ పేరిట ఎఫ్‌డీలు ఉన్నాయి. అరోరా ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన అక్రమాలపై పోరాడాం. తెలంగాణ యూనివర్సిటీని కామారెడ్డిలో పెట్టమని కోరాం. అప్పుడు మంత్రిగా ఉన్న షబ్బీర్ అలీ ఏం చేశారు. తప్పుడు మాటలు మాట్లాడితే ఊరుకోం. సోమవారం కలెక్టర్ వద్దకు వెళ్దాం. నాపై ఒక్క తప్పు తేలినా కాళ్లు పట్టుకుంటా, పదవి వదులుకుంటా. రమ్మంటే సీఎంఓకు వస్తా' అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ కాలేజీ భూముల్లో ఒక్క ఇంచు తేడా వచ్చిన రాజీనామా చేస్తానన్నారు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి. దొంగ ఎవరో దొర ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ఇన్ని రోజులు ప్రశాంతంగా ఉన్న కామారెడ్డిని రణరంగంగా మార్చారని ఫైర్ అయ్యారు. తనను చంపుతామని బెదిరించారని..ఇవాళ ఆ పనిచేశారని ఆరోపించారు. తాను పిలిస్తే వేలమంది రోడ్లమీదకు వచ్చేవాళ్లు.. అపుడు పరిస్థితి ఎలా ఉండేదని ప్రశ్నించారు వెంకటరమణా రెడ్డి. తాను తప్పు చేసినట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పారు. రేపటి నుంచి గ్రామాల్లో తిరుగుతా. ఇక యుద్ధ వాతారణమేనని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి హెచ్చరించారు. తనపై ఏం జరిగినా ప్రభుత్వానిది, సీఎందే బాధ్యత అనిచెప్పారు. ఇవాళ కారు బోల్తా పడింది రేపు మీ ప్రభుత్వం కూడా బోల్తా పడుతుందన్నారు. తమ కుటుంబంపై వచ్చిన ఆరోపణల విషయంలో తన నిజాయితీ నిరూపించుకునేదాక ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటి వరకు కామారెడ్డిలో ఏది జరిగిన భరించా ఇక నుంచి భరించే ప్రసక్తే లేదన్నారు.

# కామారెడ్డి ఎమ్మెల్యే ఆఫీస్ ముట్టడి

- కాంగ్రెస్ కార్యకర్తల దాడితో ఉద్రిక్తత
- పరస్పరం దాడి చేసుకున్న బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు
- రంగంలోకి పోలీసులు..



**కామారెడ్డి, ఫిబ్రవరి 21:** కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు గీరెడ్డి మహేందర్‌రెడ్డి ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి వచ్చారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మహేందర్‌రెడ్డి కారును భాజపా కార్యకర్తలు ధ్వంసం చేశారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో హైటెన్షన్ నెలకొంది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మధ్య మాటల యుద్ధం ఉద్రిక్తతలకు దారితీసింది. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ నేత గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ప్రయత్నించడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ప్రభుత్వ, అరోరా కాలేజీ భూములను వెంకట రమణారెడ్డి కబ్జా చేశారని షబ్బీర్ ఇటీవల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన వెంకట రమణారెడ్డి.. ప్రభుత్వ కాలేజీ భూములు, శిశుమందిర్ పాఠశాల, అరోరా కాలేజీ విషయంలో కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలపై తాను చర్చకు సిద్ధమని తెలిపారు. కాంగ్రెస్ ప్రజలకు నిజాలు తెలియాల్సిన అవసరం ఉందని.. సాక్ష్యాధారాలతో చర్చకు రావాలని ఎమ్మెల్యే సవాలు విసిరారు. ఈ నేపథ్యంలో శిశుమందిర్ వేదికపై బహిరంగ చర్చకు రెండు పార్టీలు సిద్ధమయ్యాయి. ఇరు పార్టీల నేతల సవాళ్లతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి క్యాంప్ ఆఫీసు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. క్యాంప్ ఆఫీసు నుంచి బయటకు రాకుండా ఎమ్మెల్యేను హౌస్ అరెస్టు చేశారు. మరోవైపు సవాలును స్వీకరించిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. మాజీ సర్పంచ్ గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. ఈ విషయం తెలిసిన బీజేపీ కార్యకర్తలు అక్కడకు చేరుకుని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ముదరడంతో మహేందర్ రెడ్డి కారుపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. కారును బోల్తా పడేశారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరు పార్టీల నేతలను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. పరిస్థితి అదుపు తప్పడంతో కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

## మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ మీడియా అకాడమి కట్టుబడి ఉందని చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ మీడియా అకాడమిలోని కాన్ఫరెన్సు హాలులో 2వ పాలకమండలి సమావేశం చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలోని 8 జిల్లాలకు చెందిన జర్నలిస్టులకు శిక్షణా కార్యక్రమాలు, వివిధ అంశాలపై 7 వర్క్ షాప్ లు, 12 మంది సీనియర్ జర్నలిస్టులు చేసిన సేవలను రాబోయే తరాలకు తెలియపర్చాలనే ఉద్దేశ్యంతో వారి జీవితాలపై మోనోగ్రాఫ్స్ ముద్రించినట్లు ఆయన తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా విడతల వారీగా 120 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయం, 5 సంవత్సరాల కాల పరిమితితో నెలకు 3 వేల రూపాయల పెన్షన్ సదుపాయం కల్పించినట్లు ఆయన వివరించారు. అదే విధంగా అనారోగ్యం, ప్రమాదాలకు గురైన 19 మంది జర్నలిస్టులకు ఆర్థిక సహాయం చేశామన్నారు. అకాడమి భవన నిర్వహణలో భాగంగా 250 మంది సీటింగ్ కెపాసిటీ గల ఆడిటోరియం అ÷–దదెకు ఇవ్వడానికి సమావేశంలో చర్చించగా కమిటీ సభ్యులు తమ ఆమోదం తెలుపడం పట్ల కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వర్కింగ్ కౌన్సిల్ సభ్యులు మీడియా అకాడమి భవన నిర్వహణలో భాగంగా ఆడిటోరియం అద్దెకు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేస్తునే ఈ విధానం పూర్తిగా ఆన్ లైన్ విధానం ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకునే విధంగా మీడియా అకాడమి వెబ్ సైట్లో ఆయా తేదీలు, సమయ పాలనని పొందుపర్చాలని సూచించారు. అప్పుడే పూర్తి పారదర్శకత చేకూరుతుందని వారు వెల్లడించారు. అందుకోసం ప్రభుత్వ ఆధీనంలోని రవీంద్రభారతి, జె.ఎన్.టి.యూ., సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయాకు సంబంధించిన విధి, విధానాలను అధ్యయనం చేసి అ÷–దదెకు సంబంధించిన విధి విధానాలను రూపొందించాలని మీడియా అకాడమి కార్యదర్శికి సూచించారు. ఈ పాలక మండలి సమావేశంలో సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ శ్రీమతి సి.హెచ్. ప్రియాంక, ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ సతీష్ కుమార్ తల్లాడి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ ఇంచార్జి హెడ్ డా. సునిల్ కుమార్ పోతన, దూరదర్శన్ కేంద్ర ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ శ్రీమతి ఎ. చాందిని, ఆల్ ఇండియా రేడియే ప్రోగ్రామ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. రమేష్ సుంకసారి, స్పెషల్ గెస్ట్ వీర నారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం జర్నలిజం డిపార్టుమెంట్ హెడ్ బి.వి. కృష్ణాజీరావు, తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.



# మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హౌస్ అరెస్టు

**మేడ్చల్, ఫిబ్రవరి 21:** మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డితోపాటు పెద్ద ఎత్తున ఈటల నివాసానికి చేరుకున్న పోలీసులు ఆయన్ను ఇంట్లోనే నిర్బంధించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇంటిమీద దాడి నేపథ్యంలో ఆయన్ని పరామర్శించేందుకు ఈటల రాజేందర్ కామారెడ్డి బయల్దేరారు. ఈ క్రమంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈటలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ప్రభుత్వ వైఖరిని, పోలీసుల తీరును ఈటల తీవ్రంగా ఖండించారు. గుండాయిజం చేస్తూ ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.



# అమెరికాతో ఒప్పందం రైతాంగానికి నష్టం

## దేశ రైతులతో పాటు తెలంగాణకూ ముప్పే

## మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్,ఫిబ్రవరి21 :** కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ఇటీవల చేసుకున్న ఒప్పందాల వల్ల తెలంగాణ రైతులతో పాటూ దేశంలోని రైతులు తీవ్ర నష్టానికి గురయ్యే ప్రమాదం ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అమెరికాలో సాగవుతున్న జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి వంటి పంటలను భారతదేశంలోకి ఎలాంటి టాక్స్ లేకుండా అనుమతించడం వల్ల మన దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న రైతులతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రైతులు ప్రమాదంలో పడతారని తెలిపారు. మన దేశంలో కూడా అన్నదాతలు మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, పత్తి పంటలని ఎక్కువగా పండిస్తూ జీవనం సాగిస్తున్నారని వివరించారు. అమెరికా దేశం నుంచి ఈ పంటలను దిగుమతి చేసుకోవడం వల్ల తెలంగాణలో ఉన్న రైతులంతా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో రైతులకు సంబంధించిన ఓ కార్యక్రమానికి హరీశ్‌రావు ఇవాళ (శనివారం) హాజరయ్యారు. వివిధ స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయం చేస్తే మంచి లాభాలు పొందే అవకాశం ఉందని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న యాంత్రిక పరికరాలను ఉపయోగించుకోవాలని దిశానిర్దేశర చేశారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ సర్కార్ రైతు భరోసా రావడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. కేవలం 12 గంటల పాటే విద్యుత్ సరఫరా ఇస్తున్నారని, ఎరువులు సకాలంలో అందడం లేదని చెప్పుకొచ్చారు. అన్నదాతల సమస్యలను త్వరలో జరిగే రాష్ట్ర బ్జడెట్ సమావేశాల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేసే రైతులకు వ్యవసాయ పనిముట్లు, డ్రోన్లు, ట్రాక్టర్లు సబ్సిడీకి ఇచ్చే విధంగా బ్జడెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి చర్యలు

**నిర్మల్, ఫిబ్రవరి 21 :** గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి చర్యలు తిసుకుంటున్నట్లు ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్ బి.ఎం వినోద్ కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ, గల్ఫ్ ఎన్ఆర్ఐ పాలసీ రూపకల్పనకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్ వినోద్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రం నుంచి వివిధ గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న కార్మికుల సంక్షేమం కొరకు ప్రభుత్వం సమగ్ర ఎన్ఆర్ఐ పాలసీని రూపొందించేందుకు కృషి చేస్తుందని అన్నారు. ఇందులో భాగంగానే కమిటీ, నిర్మల్ జిల్లాలో పర్యటించిందని తెలిపారు. గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న కార్మికులకు ఏ విధమైన పాలసీలు పాలసీలు రూపొందించాలన్న విషయంపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా తెలుసుకునేందుకు గల్ఫ్ వలస కార్మికులు, వారి కుటుంబాలతో వివరాలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.





# రియల్ ప్రాజెక్టు ప్రకటనల్లో రెరా రిజిస్ట్రేన్ తప్పనిసరి

## నిబంధనలు ఉల్లంఘించిన అమేయ, వర్టెక్స్, గోద్రేజ్ ప్రాజెక్టులు

## ఆయా సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** ఇల్లు/ప్లాట్/యూనిట్ అమ్మకాలపై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ రిజిస్ట్రేషన్ లేకుండా కొనుగోలుదారులను ఆకర్షించేందుకు ముందస్తు ప్రకటనలు ఇచ్చి మోసం చేయద్దని ప్రమోటర్లు/డెవలపర్లు, ఏజెంట్లు మరియు ప్రచార మాధ్యమాలను తెలంగాణ రెరా అథారిటీ గట్టిగా హెచ్చరించింది.రెరా చట్టం ప్రకారం, 500 చదరపు మీటర్లు దాటితే మరియు8 కంటే ఎక్కువ యూనిట్లు కలిగి ఉన్న ప్రతి ప్రాజెక్టును ముందుగా తెలంగాణ రెరాలో రిజిస్టర్ చేయాలని, రెరా అథారిటీ ప్రాజెక్టు వివరాలను పరిశీలించి, రిజిస్ట్రేషన్ నంబరును మంజూరు చేసిన తర్వాతే ఆ నంబరు ద్వారా అమ్మకాలపై ప్రకటనలు చేయాలని మోటర్లు/డెవలపర్లు, ఏజెంట్లు మరియు ప్రచార మాధ్యమాలను సూచించింది. ఇందులో భాగంగా ఇటీవల రిజిస్ట్రేషన్ నంబరు పొందుపరచనిచట్టవిరుద్ధమైన ప్రకటనలు రెరా దృష్టికి రావడంతో ఆయా ప్రాజెక్టు సంస్థలకు రెరా అథారిటీ షోకాజ్ నోటీసులను జారీ చేసింది. గోద్రెజ్ ప్రాపర్టీస్, నవనామి ఎలివేట్ ప్రాజెక్టు, వర్టెక్స్ విరాట్ ప్రాజెక్టు, స్వర్గసీమ అమేయ ప్రాజెక్టు, తిరుమల హిల్స్ మొదలగు రియల్ ఎస్టేట్ కన్ స్ట్రక్షన్ కంపెనీలు ఇందులో ఉన్నాయి. కొన్ని కన్ స్ట్రక్షన్ కంపెనీలు రెరా రిజిస్ట్రేషన్ నంబరును పొందుపరిచినప్పటికీ, ఆ ప్రకటన రెరా నిబంధనల మేరకు లేనట్టు గా అథారిటీ గుర్తించింది. స్వర్గసీమ కన్ స్ట్రక్షన్ వారి అమేయ ప్రాజెక్టు ప్రకటనలో అక్షరాల సైజు, ప్రాజెక్టు పూర్తిపేరు, లేఅవుట్ గా రిజిస్టర్ చేసి, ప్రకటన మాత్రం పూర్తి రెసిడెన్షియల్ ప్రాజెక్టుగా చూపిస్తూ కొనుగోలుదారులను తప్పు దోవ పట్టించడం లాంటి ఉల్లంఘనలను గమనించిన రెరా, ఆ సంస్థకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.



సంపాదకీయం

## నయా నియంతృత్వంలో డోలాన్డ్ ట్రంప్


ట్రంప్ కారణంగా ప్రపంచ దేశాలకు పీడతప్పడం లేదు. సుంకాలపై అమెరికా సుప్రంకోర్టు చెంప ఛెళ్లు మనిపించినా తగ్గేది లేదంటున్న ట్రంప్‌తో చిక్కులు, ముప్పు తప్పేలా లేదు. ఎందుకంటే ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని, సుప్రీం తీర్పును అధ్యయనం చేస్తున్నామని ప్రకటించారు. ఇది ఓ రకంగా అమెరికా పౌరులకే కాకుండా, ప్రపంచ పౌరులకు కూడా అశనిపాతం లాంటిది. ఇంకా చెప్పాలంటే ప్రపంచానికి ట్రంప్ ఇప్పుడు గుదిబండగా మారారు. ఆయన యుద్ధ పిపాస కూడా ప్రపంచ దేశాలకు శాపంగా మారుతోంది.

అధికారం లేకున్నా.. అత్యవసర చట్టం కింద అడ్డగోలు సుంకాలు విధిస్తామంటే కుదరదని.. అది రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. సుంకాలు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంది తప్ప.. రాజ్యాంగ నిర్మాతలు ఆ హక్కును కార్యనిర్వాహక శాఖకు అప్పగించలేదని స్పష్టం చేసింది. ట్రంప్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు చెబితే.. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు అమెరికా ప్రయోజనాలకే విరుద్ధంగా ఉందంటూ ట్రంప్ మండిపడ్డారు! విదేశీ శక్తుల ప్రభావానికి లోనయ్యారంటూ జడ్జీలపైనే ఆరోపణలు చేశారు. వారు అమెరికాకే అవమానకరమని దుయ్యబట్టారు. సుంకాలపై తగ్గేదేలేదని..వాటి స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాలను అమలుచేస్తామని తేల్చిచెప్పారు. వేరే చట్టాల కింద..అన్ని దేశాలపైనా 10శాతం ప్రత్యామ్నాయ సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. అంటే కోర్టులన్నా ట్రంప్ లెక్కచేయడం లేదని అర్థం చేసుకోవాలి. ఇది ఓ రకంగా చెప్పాంటే నాజీలను మించిన నియంతృత్వ ధోరణిలో ట్రంప్ ఉన్నారు. నాజీనేత హిట్లర్‌ను మించిన నియంతగా ఇప్పుడు ట్రంప్ అవతరించాడు. ముక్కుపిండి సుంకాలు విధించడం, యుద్ధాలతో బెదరించడం అలావాటు చేసుకున్న ఆధునిక నియంతలా ట్రంప్ మారాడు. ఇది ప్రపంచానికి ఓ హెచ్చరిక కావాలి. 'విమోచన దినం' పేరుతో గత ఏడాది ఏప్రిల్ 2వ తేదీన.. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద పలు దేశాలపై ఆయన విధించిన భారీ టారిఫ్‌లను కొట్టేస్తూ శుక్రవారం తీర్పు నిచ్చింది. ఆ చట్టం కింద ఇతర దేశాలతో వాణిజ్యాన్ని నియంత్రించే హక్కు మాత్రమే ఉంటుంది తప్ప సుంకాలు విధించే హక్కు ఉండదని తేల్చిచెప్పింది. తన అధికార పరిధిపై ట్రంప్ చేసిన అత్యంత వివాదాస్పద వాదనలను తోసిపుచ్చింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంటుందని.. టారిఫ్‌లు కూడా పన్నుల్లో భాగమేనని మెజారిటీ జడ్జిలు స్పష్టం చేశారు. అయితనా జడ్జిల తీర్పును తప్పు పట్టారు. ఇది న్యాయవ్యవస్థ ఉనికికి కూడా సవాల్ లాంటిదే. సుప్రీం తీర్పును కూడా సవాల్ చేసే స్థితికి ఇప్పుడు ట్రంప్ ఎదిగారంటే ఏమవుతుందో అన్న భయం అమెరికన్ల లోనే ఎక్కువగా ఉంది. టారిఫ్‌ల రూపంలో తాము కట్టిన సొమ్మును తిరిగి చెల్లించాలంటూ అతి పెద్ద వేర్‌హౌస్ చైన్ కాస్ట్‌కో సహా పలు కంపెనీలు ఇప్పటికే దిగువ కోర్టులకు క్యూ కట్టిన నేపథ్యంలో.. ఆ ప్రక్రియ సంక్లిష్టంగా ఉండొచ్చని న్యాయమూర్తి బ్రెట్ క్యావనో అభిప్రాయపడ్డారు. అంతేకాదు.. ఆయన తన తీర్పులో భారత్‌పై విధించిన 25శాతం అదనపు సుంకాల గురించి కూడా ప్రస్తావించారు. చైనా, యూకే, జపాన్, ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అధ్యక్షుడు ఈ సుంకాలను ఒక సాధనంగా ఉపయోగించుకున్నారు. రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై అదనంగా 25శాతం సుంకాలను విధించారు. రష్యా చమురు కొనబోమని భారత్ హామీ ఇవ్వడంతో ఆ సుంకాలను తొలగించారని క్యావనో గుర్తుచేశారు. ఇక.. ఈ తీర్పుతో అమెరికా స్టాక్ మార్కెట్ సూచీల్లో పెరుగుదల కనిపించింది. అంటే ఓ రకంగా మార్కెట్లు కూడా సుంకాల బారిన పడి విలవిల్లాడుతున్నాయని గుర్తించాలి. ట్రంప్ విధించిన టారిఫలతో అమెరికా ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు 14 దాకా 3,01,000 మందికిపైగా దిగుమతిదారుల నుంచి 133 బిలియన్ డాలర్లు అంటే రూ.12 లక్షల కోట్లు వసూలు చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటిదాకా వసూలైన మొత్తం కూడా కలిపితే అది 175 బిలియన్ డాలర్ల రూ.16 లక్షలకోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఇవి ఓ దేశ బడ్జెట్‌కన్నా ఎక్కువే. ట్రంప్ ప్రారంభించిన ఈ వాణిజ్య యుద్ధం.. అమెరికా వాణిజ్య భాగస్వాములతో సంబంధాలను దెబ్బతీయడమే కాక, ఆర్థిక మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తీవ్ర అనిశ్చితికి కారణమైంది. ట్రంప్ టారిఫ్ విధానాలు చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పిన్లటైందని కెనడా అభిప్రాయపడింది. తీర్పు ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నామని యూరోపియన్ యూనియన్ తెలిపింది. పరిస్థితులు ఎలా ఉన్నా అమెరికాతో తమ ప్రత్యేక వ్యాపార, వాణిజ్య సంబంధాలు కొనసాగుతాయని బ్రిటన్ తెలిపింది. అమెరికాతో కలిసి పనిచేస్తామంది. ట్రంప్ టారిఫ్‌ల వల్ల నష్టపోయిన వ్యాపారసంస్థలు, డెమొక్రాట్ల పాలనలో ఉన్న 12 అమెరికా రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ తన అధికార పరిధిని మించి ఈ చట్టాన్ని వాడారని, పన్నులు వేసే అధికారం అధ్యక్షుడికి లేదని దిగువ కోర్టు తీర్పు ఇచ్చింది. ట్రంప్ సర్కారు ఆ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. సుప్రీం కూడా ఆ తీర్పును సమర్థించింది. ఈ తీర్పును వెలువరించిన ధర్మాసనంలో.. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నియమించిన ముగ్గురు కన్జర్వేటివ్ జడ్జీలు ఉన్నారు. దీంతో తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వస్తుందని చాలా మంది భావించారు. ట్రంప్ కూడా.. ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన కేసుల్లో ఒకటని.. ఒకవేళ తీర్పు వ్యతిరేకంగా వస్తే అది దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ అవుతుందని హెచ్చరించారు. అయితే ఈ దశలో ట్రంప్ మొండివైఖరి కారణంగా అమెరికా పెత్తనం చెలాయించాలన్న పట్టుదల కనిపిస్తోంది. ప్రపంచ దేశాలు ఏమైనా తనకు అక్కర్లేదన్న ధోరణి కనిపిస్తోంది.

# అన్ని దేశాలపై 10% సుంకాలు

- వెంటనే అమల్లోకి
- సుప్రీం తీర్పు తర్వాత ట్రంప్ ప్రకటన
- వాణిజ్య దిగ్బంధానికి హెచ్చరిక

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** అమెరికా సుప్రీంకోర్టు తన పూర్వ టారిఫ్ నిర్ణయాలను రద్దు చేసిన అనంతరం అధ్యక్షుడు డోలాన్డ్ ట్రంప్‌కొత్త నిర్ణయం ప్రకటించారు. ప్రపంచంలోని అన్ని దేశాలపై 10 శాతం గ్లోబల్ టారిఫ్ విధిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఓవల్ ఆఫీస్‌లో ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేసినట్లు తెలిపారు. వైట్‌హౌస్ ప్రకటన ప్రకారం ఈ సుంకాలు ఫిబ్రవరి 24 నుంచి అమల్లోకి వచ్చి 150 రోజుల పాటు కొనసాగనున్నాయి. సుప్రీంకోర్టు తన అధికారాలను పరిమితం చేస్తూ ఇచ్చిన తీర్పుపై తీవ్ర నిరాశ వ్యక్తం చేసిన ట్రంప్, "అవసరమైతే ప్రత్యామ్నాయ చట్టాల కింద మరింత కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. పాత చట్టం కింద విధించిన టారిఫ్‌లను కోర్టు కొట్టివేస్తే, 'సెక్షన్ 122' కింద 10 శాతం గ్లోబల్ సుంకం అమలు చేస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే ఏ దేశంపైనైనా వాణిజ్య దిగ్బంధం విధించే అధికారం తనకు ఉందని పేర్కొన్నారు.



**ఉ భారత్‌పై వ్యాఖ్యలు**

రష్యా నుంచి చమురు దిగుమతుల అంశంపై ఇండియా తన అభ్యర్థన మేరకు గణనీయంగా తగ్గించిందని ట్రంప్ పేర్కొన్నారు. భారత్‌తో అద్భుతమైన సంబంధాలు కొనసాగుతున్నాయని, ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కొనసాగుతాయని తెలిపారు. పరస్పర టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించే దిశగా చర్చలు సాగుతున్నాయని సంకేతాలు ఇచ్చారు. అలాగే భారత్‌ఉపాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల సమయంలో తాను టారిఫ్‌ల ద్వారా పరిష్కారం సాధించానని పునరుద్ఘాటించారు. ఇరు దేశాలకు "యుద్ధం చేయాలనుకుంటే చేయండి, కానీ అమెరికాతో వ్యాపారం చేయలేరు" అని చెప్పినట్లు వ్యాఖ్యానించారు. అమెరికా సుప్రీంకోర్టు పన్నులు విధించే అధికారం ప్రధానంగా కాంగ్రెస్‌కే ఉందని స్పష్టం చేయడంతో ట్రంప్ న్యాయవ్యవస్థపై విమర్శలు గుప్పించారు. తీర్పు దేశ ప్రయోజనాలకు విరుద్ధమని, కొందరు న్యాయమూర్తులు సరైన నిర్ణయం తీసుకోలేదని ఆరోపించారు. టారిఫ్‌ల ద్వారా గత ఏడాది నుంచి ఇప్పటివరకు సుమారు 175 బిలియన్ డాలర్లకు పైగా వసూలైనట్లు అంచనా. ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సి ఉంటుందా అన్న ప్రశ్నకు ట్రంప్ స్పష్టత ఇవ్వలేదు. సుంకాల వల్ల అమెరికా పరిశ్రమలు బలపడుతున్నాయని, నిరుద్యోగం తగ్గిందని ఆయన పేర్కొన్నారు. అయితే అంతర్జాతీయంగా ఈ నిర్ణయం వాణిజ్య సంబంధాలపై ప్రభావం చూపే అవకాశముంది. ప్రపంచ మార్కెట్లు, వాణిజ్య భాగస్వామ్య దేశాలు తదుపరి పరిణామాలను గమనిస్తున్నాయి.

# ప్రధాని నివాసం కోసం మురికివాడల ఖాళీ

- ఇప్పటికే నోటీసులు ఇచ్చిన అధికారులు
- దాదాపు 700 కుటుంబాలకు ఈ నోటీసులు జారీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** దేశ రాజధాని న్యూఢిల్లీలో పరధాని నూతన నివాస నిర్మాణం.. దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో మురికి వాడల్లో నివాసముంటున్న కుటుంబాలపై పడింది. అక్కడి నుంచి ఖాళీ చేయాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ వారిని ఆదేశించింది. ఈ మేరకు వారికి నోటీసులు పంపింది. అక్కడి నుంచి ఖాళీ చేయకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. దాదాపు 700 కుటుంబాలకు ఈ నోటీసులు అందాయని తెలుస్తున్నది. అయితే కచ్చితమైన గడువు తేదీని పేర్కొనకపోవడం, పునరావాసంపై ఎలాంటి స్పష్టతా లేకపోవడంతో అక్కడి స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రధాని నూతన నివాసం నిర్మాణం నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ఈ నోటీసులు వచ్చినట్టు అంతా భావిస్తున్నారు. రేస్‌కోర్స్ రోడ్ వెంట ఉన్న భాయిరామ్ క్యాంప్, మస్జీద్ క్యాంప్, డిఐడి క్యాంప్ నివాసితులకు ఈ నోటీసులు అందినట్టు సమాచారం. నోటీసులో ఆ భూమిని ప్రభుత్వానికి చెందినదనీ, ఇకపై అక్కడ నివసించడం అనధికారికంగా పరిగణిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఆదేశాలను పాటించకపోతే చట్ట ప్రకారం అక్కడి నుంచి తొలగింపు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీనిపై అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. ఈ నోటీసుతో అక్కడి స్థానికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. చాలా మంది నిరుపేదల అక్కడ నివసిస్తూ సమీప ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారు. ఖాళీ చేయాల్సిన గడువు, పునరావాసం, ప్రత్యామ్నాయాలపై ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదని వారు అంటున్నారు. కాగా వారు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులను సంప్రదించి.. పునరావాసంపై స్పష్టత కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా ఈ చర్యలు రాజధాని సెంట్రల్ జోన్ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునే విస్తృత ప్రణాళికలో భాగమని అధికారులు తెలిపారు.

# ఢిల్లీ నుంచి మీరట్‌కు కేవలం 58 నిమిషాల్లోనే

**అందుబాటులోకి ఢిల్లీ-మీరట్ నమో భారత్ కారిడార్**

**కారిడార్‌ను జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం మీరట్‌లో పర్యటించి సుమారు రూ.12,930 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనలో భాగంగా 82 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ 'నమో భారత్' రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్కారిడార్‌ను పూర్తిస్థాయిలో జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ 'మీరట్ మెట్రో' సేవలను కూడా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు మెట్రోలో ప్రయాణించారు. తాజా ప్రారంభోత్సవంతో ఢిల్లీలోని సారాయ్ కాలే ఖాన్ నుంచి మీరట్‌లోని మోదీపురం వరకు ప్రయాణ సమయం కేవలం 58 నిమిషాలకు తగ్గనుంది. ఇంతకుముందు ఈ ప్రయాణానికి దాదాపు మూడు గంటల సమయం పట్టేది. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే మీరట్ మెట్రో, దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలవనుంది. మరో విశేషమేమిటంటే, ఒకే రైల్వే ట్రాక్‌పై రీజనల్ రైలు (నమో భారత్), లోకల్ మెట్రో (మీరట్ మెట్రో) నడవడం దేశంలో ఇదే తొలిసారి. ఈ కొత్త విధానం పట్టణ రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రద్దీ తగ్గడంతో పాటు పర్యావరణ హితమైన రవాణాకు మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వం తెలిపింది.





# దిల్లీ ఉగ్రకుట్రకు లష్కరే ప్లాన్

**ఆలయాలే లక్ష్యంగా దాడికి స్కెచ్**

**నిఘా వర్గాల హెచ్చరికలు జారీ**

**ఇతర నగరాల్లోనూ పేలుళ్లకు కుట్ర**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** దేశ రాజధాని దిల్లీలో మరోసారి పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ లష్కరే తయిబా(రామ) కుట్ర పన్నింది. ఈ మేరకు నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో దిల్లీ పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. దిల్లీలోని ఎర్రకోట, చాందీనీ చౌక్ ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలే లక్ష్యంగా ఎల్‌ఈటీ దాడులకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. చాందీనీ చౌక్ ప్రాంతంలోని ఒక దేవాలయంపై ఐఈడీతో దాడి చేసేందుకు ఉగ్రవాదులు వ్యూహం పన్నుతున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఫిబ్రవరి 6న పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారంగా, భారత్‌లోని ప్రముఖ ధార్మిక స్థలాలపై దాడులు చేయాలని లష్కరే ప్లాన్ చేస్తోందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. కేవలం దిల్లీలోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలు కూడా ఉగ్రవాదుల హిట్ లిస్టులో ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది నవంబర్ 10న ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడులో 12 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఆ ఘటనపై దర్యాప్తు ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో మరోసారి ఎర్రకోట పరిసర ప్రాంతాలపై ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాల నుంచి హెచ్చరికలు రావడం దేశ రాజధానిలో కలకలం రేపుతోంది.

## హైదరాబాద్‌లో ఉగ్రకుట్ర.. ముగ్గురు అరెస్ట్

**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** ఉగ్రవాద దాడులకు కుట్ర చేస్తున్నారన్న ఆరోపణలతో మరోసారి హైదరాబాద్‌లో తీవ్ర కలకలం రేపింది. చంచల్‌గూడ జైలు నుంచే ఈ ఉగ్రకుట్రకు ప్లాన్ చేస్తున్నట్లు అనుమానిస్తున్నారు. జైలు నుంచే ఉగ్ర కుట్రకు ప్రణాళికలు సాగినట్లు అనుమానాలు వస్తున్నాయి. మరోవైపు.. వరుసగా పేలుళ్లు జరిపేందుకు కుట్ర చేస్తారన్న ఆరోపణల కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు. పాకిస్తాన్ అడ్డాగా పనిచేసే లష్కరే తోయిబా అనే ఉగ్రసంస్థకు చెందిన ఉగ్రవాది.. చంచల్‌గూడ జైలు నుంచి ఈ ఉగ్రకుట్ర చేసినట్లు ఆరోపణలు రావడంతో అలర్ట్ అయ్యారు. ఈ ఉగ్రవాదితో ములాఖత్ అయ్యేందుకు వచ్చిన తన భార్యతో ఆ టెర్రరిస్ట్ ఉగ్రదాడుల గురించి సంభాషణలు చేసినట్లు సమాచారం. తన భార్య ద్వారా జైలు నుంచి బయటికి ఉగ్ర సమాచారాన్ని చేరవేసినట్టు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# ‘ముఠా’కు నిరుద్యోగులే ‘టార్గెట్’!




## ‘సైబర్ ఫ్రాడ్ ఏజెంట్ల గ్యాంగ్’ గుట్టురట్టు

### జగిత్యాలలో తీగలాగితే ‘లావోస్’లో కదిలిన డొంక!

### చైనా కంపెనీ ఆధ్వర్యంలోని ‘కాల్ సెంటర్’లలో జాబ్స్‌అని మోసం

### అమెరికాలోని ‘భారతీయులే’ వీరి లక్ష్యం

### థాయిలాండ్ సరిహద్దుల్లో అక్రమ తరలింపు..

### చైనా టీమ్ లీడర్లు, ఫేక్ ప్రొఫైల్స్..

### ‘అంతర్జాతీయ మోసాల గ్యాంగ్’పై జగిత్యాల పోలీసుల జబర్దస్త్ ఆపరేషన్

**ఉద్యోగాల పేరుతో లక్షలు లాగేసి.. యువకులను ‘లావోస్’కు తరలించి.. వారితో ‘సైబర్ ఫ్రాడ్’ చేయించిన ‘అంతర్జాతీయ మోసాల గ్యాంగ్’ను జగిత్యాల పోలీసులు ఛేదించారు. ప్రధాన నిందితుడు ఇస్లావత్ విజయేందర్ అలియాస్ ఆండ్రూను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో డ్రామాటిక్‌గా అరెస్ట్ చేసిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ టీమ్, ఈ కేసులో చైనా కనెక్షన్‌లు, ఫేక్ సోషల్ మీడియా ప్రొఫైల్స్ బట్టబయలు చేసి సంచలనం సృష్టించారు. బాధితుల ఫిర్యాదు నుంచి మొదలైన ఇన్వెస్టిగేషన్, ఒక్క తీగ లాగితే మొత్తం డొంక కదిలినట్టు మారి, పలువురు నిందితులను వెలికితీసింది..**

- నేటి సాక్షి, జగిత్యాల బ్యూరో (రాధారపు నర్సయ్య)






## అసలు ఏం జరిగిందంటే.?

### (మోసాల మాయాజాలం స్టార్ట్ )

ఇది ఒక సాధారణ ఉద్యోగ మోసం కాదు.. ఇది అంతర్జాతీయ స్థాయిలో వ్యాపించిన సైబర్ క్రైమ్ గ్యాంగ్ ఆపరేషన్. జగిత్యాల మరియు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలకు చెందిన యువకులను లక్ష్యంగా చేసుకుని, ‘లావోస్-దేశం’లో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ చూపి డబ్బులు లాగేశారు. వారిని థాయిలాండ్‌కు తరలించి, అక్కడి నుంచి అక్రమంగా లావోస్‌కు పంపి, సైబర్ ఫ్రాడ్ చేయించారు. మోసపోయిన యువకులు అమెరికా మహిళల ఫేక్ ప్రొఫైల్స్‌తో సోషల్ మీడియాలో చాటింగ్ చేసి, టార్గెట్‌ల వ్యక్తిగత వివరాలు సేకరించి చైనా టీమ్ లీడర్లకు అందజేసేవారు. నిరాకరించిన వారిని పాస్‌పోర్టులు ఇవ్వకుండా, ఇండియాకు తిరిగి రానివ్వకుండా వేధించేవారు. ఇలాంటి మోసాల్లో లక్షల రూపాయలు లాగేసి, యువకుల జీవితాలను నాశనం చేశారు.

## ఎలా జరిగింది.?

### (స్టెప్ బై స్టెప్ మోసం)

నిందితులు స్నేహితులు, స్థానిక కనెక్షన్ల ద్వారా యువకులను టార్గెట్ చేసేవారు. ప్రధాన నిందితుడైన విజయేందర్ తన స్నేహితుడు మీసాల రాజశేఖర్ ద్వారా దండుగుల కళ్యాణ్, తర్వాత శ్యాంరావు రాజశేఖర్ ద్వారా లావోస్‌లోని రాజు (వైజాగ్ నివాసి, ఫోన్: +8562055403979)తో కనెక్ట్ అయ్యాడు. రాజు థాయిలాండ్ సమీపంలోని కంపెనీలో కంప్యూటర్ ఆపరేటర్ జాబ్ అని చెప్పి ఆహ్వానించాడు. విజయేందర్ 2024 నవంబర్ 25న థాయిలాండ్ చేరి, బస్సులో లావోస్‌లోని ‘XING YING’ కంపెనీకి వెళ్లాడు. అక్కడ చైనా వ్యక్తులు ‘గోల్డెన్ ట్రయాంగిల్’ ప్రాంతానికి బోటు ద్వారా అక్రమంగా తరలించారు. అక్కడ అమెరికా మహిళా ఇన్‌ఫ్లుయెన్సర్ల పేర్లతో ఫేక్ ప్రొఫైల్స్ సృష్టించి, ఫోటోలు, వీడియోలతో పిడిఎఫ్’లు ఇచ్చి సోషల్ మీడియాలో పోస్ట్ చేయమన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో అమెరికా’లోని భారతీయులను టార్గెట్ చేసి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపి, స్క్రిప్ట్ ప్రకారం చాటింగ్ చేసి వివరాలు సేకరించేవారు. మోసపోయిన యువకులు పని చేయకపోతే ఫైన్ కట్టి తిరిగి వచ్చేవారు, లేదంటే అక్కడే చిక్కుకునేవారు.

## ఎలా బయటకు పొక్కింది?

### (ఫిర్యాదు నుంచి అరెస్ట్ వరకు డ్రామా)

ఈ మొత్తం మోసాల భాగోతం బయటపడింది ఒక బాధితుడి ఫిర్యాదుతో.. 2025 మార్చి 4న జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన కేశావతుల అరవింద్ జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విజయేందర్ మరియు ఇతరులు లావోస్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి డబ్బులు తీసుకుని, థాయిలాండ్ నుంచి లావోస్‌కు తరలించి సైబర్ ఫ్రాడ్ చేయించారని, పాస్‌పోర్టులు ఇవ్వకుండా వేధించారని పేర్కొన్నాడు. దీంతో PS 6 Cr.No. 88/2025 U/Sec. 318(4) BNS మరియు Sec. 24 of Immigration Act కింద కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలెట్టారు.

ఇన్వెస్టిగేషన్ సమయంలో విజయేందర్ ఇండియాకు తిరిగి వస్తున్నట్టు ఇంటెలిజెన్స్ రిపోర్ట్ వచ్చింది. 2026 ఫిబ్రవరి 17న హైదరాబాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌లో అతడిని అరెస్ట్ చేశారు. విచారణలో అతడు తన నేపథ్యం, మోసాల వివరాలు బయటపెట్టాడు. నిందితుడు 2005-06లో ఎస్ఎస్సి పూర్తి చేసిన తర్వాత 2010 జూన్లో దుబాయ్ ‘మ్యాక్స్ కేర్’ కంపెనీలో క్లీనర్గా పనిచేశాడు. 2012 డిసెంబర్లో తిరిగి వచ్చి 2015లో వివాహం చేసుకున్నాడు. ఇద్దరు సంతానం ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల కారణంగా విదేశాల్లో ఉద్యోగాల కోసం ప్రయత్నించాడు. 2017లో మలేషియా వెళ్లి 6 నెలలు ప్రయత్నించినా ఉద్యోగం రాకపోవడంతో 2018లో తిరిగి వచ్చాడు. 2022లో ఒమాన్ (మస్కట్)లో క్లీనర్గా 2 సంవత్సరాలు పనిచేసి 2024లో భారత్ కు తిరిగి వచ్చాడు. ఆర్థిక ఇబ్బందులతో ఈ గ్యాంగ్‌లో చేరిన విషయాలు వెల్లడించాడు.

## ఎవరు ఈ ముఠా సభ్యులు?

### (ఇదీ ఆ గ్యాంగ్ మెంబర్స్ ప్రొఫైల్)

ఉద్యోగం కోసం వెతుకుతున్న సమయంలో స్నేహితుడు మీసాల రాజశేఖర్ ద్వారా దండుగుల కళ్యాణ్ పరిచయమయ్యాడు. ఆయన ద్వారా శ్యాంరావు రాజశేఖర్ (ధర్మపురి నివాసి) పరిచయమై, ఆయన ద్వారా 2024 నవంబర్లో లావోస్లో ఉన్న రాజు (వైజాగ్ నివాసి, ఫోన్ +8562055403979)తో కనెక్ట్ అయ్యాడు. రాజు థాయిలాండ్ (బ్యాంకాక్) సమీపంలోని తన కంపెనీలో సైబర్ ఫ్రాడ్ కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఉందని చెప్పాడు. ఈ అంతర్జాతీయ సైబర్ క్రైమ్ గ్యాంగ్‌లో పలువురు స్థానిక మరియు విదేశీ సభ్యులు ఉన్నారు. ఇంకా చైనా టీమ్ లీడర్లు, ఏజెంట్లు ఇన్వాల్వ్ అయ్యారు. వీరు స్థానికంగా యువకులను రిక్రూట్ చేసి, అక్రమ తరలింపు చేసేవారు.



## తీగలాగితే డొంక కదిలింది?

### (ఇన్వెస్టిగేషన్ చైన్ రియాక్షన్)

ఒక్క ఫిర్యాదు నుంచి మొదలైన ఇన్వెస్టిగేషన్, తీగలాగితే డొంక కదిలినట్టు మారి మొత్తం గ్యాంగ్‌ను బట్టబయలు చేసింది. అరవింద్ ఫిర్యాదు చేసిన తర్వాత, పోలీసులు విజయేందర్ ట్రావెల్ హిస్టరీని ట్రాక్ చేశారు. అతడు ఇండియాకు వస్తున్నట్టు తెలిసి ఎయిర్‌పోర్ట్‌లో అరెస్ట్ చేశారు. విచారణలో అతడు మీసాల రాజశేఖర్, దండుగుల కళ్యాణ్, శ్యాంరావు రాజశేఖర్, రాజు పేర్లు బయటపెట్టాడు. ఇది చైనా కనెక్షన్‌లకు దారి తీసింది XING YING కంపెనీ, గోల్డెన్ ట్రయాంగిల్ అక్రమ తరలింపు వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఇలా ఒక్కరి విచారణ నుంచి మరిన్ని లింకులు బయటపడ్డాయి, మొత్తం నెట్‌వర్క్ ఎక్స్‌పోజ్ అయింది.

## అక్రమ తరలింపు, సైబర్ ఫ్రాడ్ ఆపరేషన్

2024 నవంబర్ 25న విజయేందర్ థాయిలాండ్ చేరుకున్నాడు. అక్కడి నుంచి బస్సులో లావోస్లోని ‘XING YING’ కంపెనీకి వెళ్లాడు. చైనా వ్యక్తులు తీసుకుని థాయిలాండ్ నుంచి ‘గోల్డెన్ ట్రయాంగిల్’ ప్రాంతానికి బోటు ద్వారా అక్రమంగా సరిహద్దు దాటించారు. అక్కడ టీమ్ లీడర్లు అమెరికాకు చెందిన మహిళా ఇన్ఫ్లుయెన్సర్లు/మోడల్స్ పేర్లతో నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి పిడిఎఫ్’లు ఇచ్చి, ఆ వ్యక్తిలా నటించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయమన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో అమెరికాలో ఉన్న లేదా స్థిరపడిన భారతీయులను టార్గెట్ చేసి ఫ్రెండ్ రిక్వెస్ట్లు పంపేవారు. అంగీకరించిన తర్వాత స్క్రిప్ట్ ప్రకారం చాటింగ్ చేసి నమ్మకం పొంది వ్యక్తిగత వివరాలు సేకరించి చైనా టీమ్ లీడర్‌కు సమర్పించేవారు.

## మోసపోయిన బాధితులు ఎవరు?

2025 జనవరిలో విజయేందర్ స్నేహితుడు మీసాల రాజశేఖర్ (పెంబట్ల గ్రామం, సారంగాపూర్ మండలం)కు లావోస్‌లో సైబర్ ఫ్రాడ్ ఉద్యోగాలు ఉన్నాయని అడిగాడు. రాజశేఖర్ కాల్ సెంటర్ ఉద్యోగాలు ఉన్నాయని చెప్పి జగిత్యాల జిల్లాకు చెందిన కేశావతుల అరవింద్, రెంటం రంజిత్, ముదిగం ప్రేమ్ ముగ్గురిని పరిచయం చేశాడు. వారి నుంచి రూ. 1,05,000 తీసుకుని బ్యాంకాక్ విజిటింగ్ వీసాపై టికెట్లు బుక్ చేశారు. ముదిగం ప్రేమ్ షో మనీ లేకపోవడంతో ఇండియాకు తిరిగి వెళ్లాడు. మిగిలిన ఇద్దరిని లావోస్ తీసుకెళ్లి రాజుకు కలిపారు. పాస్‌పోర్టులు తీసుకుని సైబర్ ఫ్రాడ్ చేయమన్నారు. వారు నిరాకరించి ఫైన్ రూ. 1,00,000 కట్టి ఇండియాకు తిరిగి వచ్చారు. అదే సంవత్సరంలో భుక్య అమర్ సింగ్ (మల్లాపూర్ మండలం - ఒబులుపూర్), అజ్మీర అజయ్, మలవత్ సతీష్ కుమార్ (రాయికల్ మండలం - తాట్లవాయి గ్రామం)లను మోసం చేసి రూ. 75,000 తీసుకుని బ్యాంకాక్ పంపారు. మనీ షో లేకపోవడంతో కొందరు తిరిగి వచ్చారు. తర్వాత మళ్లీ వచ్చి 3 నెలలు వర్క్ చేసి తిరిగి వచ్చారు. ఎనుగంటి ప్రవీణ్ గౌడ్ (నిజామాబాద్), తిరుపతి ములవత్ (ఇబ్రహీంపట్నం మండలం - అమ్మక్కపేట్) 6 నెలల క్రితం తిరిగి వచ్చారు, కానీ వెంకటేష్ (కరీంనగర్) ప్రస్తుతం లావోస్‌లోనే సైబర్ ఫ్రాడ్ చేస్తున్నాడు. వీరంతా ఉద్యోగ ఆశతో మోసపోయి, ఆర్థికంగా, మానసికంగా నష్టపోయారు.

## ఫ్రాడ్ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దు

### ఎస్పీ అశోక్ కుమార్



విదేశీ ఉద్యోగాలు, త్వరిత వీసాలు కల్పిస్తామని చెప్పే అనుమానాస్పద ఏజెంట్లను నమ్మవద్దని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ హెచ్చరించారు. ఏ సంస్థ ద్వారా అయినా ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకునే ముందు అధికారిక వెబ్సైట్లు, ప్రభుత్వ గుర్తింపు వివరాలు తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. మోసాలకు గురైతే వెంటనే 1930 సైబర్ హెల్ప్ లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని సూచించారు. ఇలాంటి మోసాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం చేయడంలో పోలీస్ శాఖ ఎప్పుడూ ముందుంటుందని ఎస్పీ అశోక్ కుమార్ భరోసా ఇచ్చారు. ఈ ప్రెస్ మీట్లో సైబర్ క్రైమ్ డిఎస్పీ వెంకటరమణ, రూరల్ ఇన్‌స్పెక్టర్‌సుధాకర్, ఎస్ఐలు ఉమాసాగర్, దినేష్ పాల్గొన్నారు.

నేటి సాక్షి TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్
ఆదివారం 22 ఫిబ్రవరి 2026

# అంగన్‌వాడీ సెంటర్‌కు విద్యుత్ సౌకర్యాలు

- చిన్న పిల్లల సౌకర్యార్థం ఫ్యాన్, లైటింగ్ ఏర్పాటు
- బొమ్మెన సర్పంచ్‌కు పేరెంట్స్ కమిటీ కృతజ్ఞతలు

**నేటి సాక్షి, కథలాపూర్ (రాధారపు నర్సయ్య):** కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అంగన్‌వాడీ సెంటర్-2లో విద్యుత్ సమస్యను పరిష్కరించి, పిల్లల సౌకర్యార్థం ఫ్యాన్లు, లైటింగ్ సదుపాయం ఏర్పాటు చేసిన గ్రామ సర్పంచ్ చిందం సుధాకర్‌కు తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### చిన్న పిల్లల కోసం సర్పంచ్ ముందడుగు.!

అంగన్‌వాడీలో కరెంట్ కొరత కారణంగా చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని గుర్తించిన సర్పంచ్ చిందం సుధాకర్ వెంటనే స్పందించి అవసరమైన ఫ్యాన్లు, లైటింగ్ ఏర్పాటు చేయించడం అభినందనీయమని పేరెంట్స్ కమిటీ పేర్కొంది. దీంతో చిన్నారులకు అనుకూల వాతావరణం ఏర్పడిందని తెలిపారు.



### పేరెంట్స్ కమిటీ ధన్యవాదాలు

పేరెంట్స్ కమిటీ సభ్యులు పిడుగు ప్రతాప్‌రెడ్డి, రాపెల్లి ఆనంద్, కడారి స్వామి, బాలె నీలకంఠం, ముంజ భూమయ్య, పోడేటి సంజీవ్, బాలె నరహరి, బాలె గంగాధర్, ఉరుమల్ల సురేష్, అల్లూరి బాపురెడ్డి, బాలె ఇస్తారయ్య తదితరులు సర్పంచ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు గ్రామాభివృద్ధికి దోహదపడతాయని వారు అభిప్రాయపడ్డారు.

# ఎర్దండి గ్రామ శివారులో మిస్టీరియస్ మర్డర్!?



- అనుమానాస్పద మృతి కలకలం
- పంట పొలంలో శవం లభ్యం.. హత్యా.? ఆత్మహత్యా.? అనే కోణంలో పోలీసుల దర్యాప్తు

**నేటి సాక్షి, ఇబ్రహీంపట్నం (రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామ శివారులోని పంట పొలం వద్ద ఒక వ్యక్తి మృతదేహం లభ్యమవడంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత, భయాందోళన నెలకొన్నాయి. శుక్రవారం రాత్రి గ్రామానికి వచ్చిన వ్యక్తి తెల్లవారే సరికి శవంగా తేలడంతో స్థానికులు ఒక్కసారిగా భయపడ్డారు. పోలీసులకు సమాచారం అందగానే వారు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

### మృతుడి గుర్తింపు-శవ పరిశీలన

పోలీసులు మృతదేహాన్ని గుర్తించగా, అతడు జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామానికి చెందిన ఎర్రోళ్ల లింబాద్రి (40/45) అని తేలింది. శవంపై తలకు బలమైన గాయాలు కనిపించడంతో ఘటన అనుమానాస్పదంగా మారింది. ఇది ఆత్మహత్య కావచ్చు లేదా ఎవరైనా హత్య చేసి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అసలు మరణ కారణం, గాయాల వివరాలు పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే స్పష్టమవుతాయని పోలీసులు తెలిపారు.

### వివాహం-విడాకులు-కుటుంబ నేపథ్యం.!

స్థానికుల వాంగ్మూలాల ప్రకారం, ఎర్రోళ్ల లింబాద్రి గతంలో ఎర్దండి గ్రామానికి చెందిన ఒక మహిళను (ఎర్రోళ్ల లక్ష్మి) వివాహం చేసుకున్నాడు. వారికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. అయితే, కొన్నేళ్ల క్రితం విడాకులు పొందారు. గత ఎనిమిదేళ్లుగా లక్ష్మి తన తల్లి (మాజీ అత్తగారు) వద్దే ఎర్దండి గ్రామంలో నివసిస్తోంది. ఇద్దరూ విడివిడిగా జీవనం సాగిస్తున్నారు. ఈ కుటుంబ నేపథ్యం ఘటనకు సంబంధించిన అనుమానాలకు తావిచ్చింది.

### రాత్రి గొడవలు ఉ కుటుంబ కలహాల కోణం

శుక్రవారం లింబాద్రి ఎర్దండి గ్రామానికి వచ్చాడు. అక్కడ తన మాజీ భార్య లక్ష్మితో గొడవపడ్డాడని, మాజీ అత్తగారింటి వద్ద చిన్న వాగ్వాదానికి (స్వల్ప వాగ్వాదం) లోనయ్యాడని స్థానికులు తెలిపారు. ఈ గొడవల నేపథ్యంలోనే ఈ అనుమానాస్పద మృతి జరిగి ఉండవచ్చనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాలు, గత వివాదాలు, స్థానికుల వాంగ్మూలాలు సేకరిస్తున్నారు.

### పోలీసుల దర్యాప్తు- గ్రామస్తుల ఆందోళన

పోలీసులు ఘటనా స్థలంలోని వివరాలు, సాక్ష్యాలు సేకరిస్తున్నారు. ఇది ఆత్మహత్యా? హత్యా? అనే రెండు కోణాల్లో విచారణ జరుగుతోంది. పూర్తి వివరాలు, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ ఘటనతో ఎర్దండి గ్రామస్తులు భయాందోళనకు గురై ఉన్నారు. ఏదైనా హత్య జరిగి ఉంటే భయం, లేదంటే కుటుంబ వివాదాల వల్ల జరిగిన దుర్ఘటన కావచ్చనే ప్రచారం జరుగుతోంది.!

# ధన్వాడ మోడల్ స్కూల్‌లో 6వ తరగతికి అడ్మిషన్లు

- ధన్వాడ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వైశాల్య



**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల కేంద్రంలో తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఆరవ తరగతి ఇంగ్లీష్ మీడియం అడ్మిషన్లు విడుదల చేసినట్లు ధన్వాడ మోడల్స్ స్కూల్ ప్రిన్సిపల్ వైశాల్య తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ధన్వాడ మోడల్ స్కూల్లో సంబంధించిన 100 సీట్లు ఉన్నాయని ఆమె వివరించారు. ఇంగ్లీష్ మీడియంలో ఉచిత విద్య ఉచితంగా పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలు యూనిఫామ్ లు మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. 9వ తరగతి నుండి ఇంటర్ రెండవ సంవత్సరం వరకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు సైన్స్ కంప్యూటర్ గ్రంథాలయం, ఆటలు క్రీడలు హాస్టల్ సౌకర్యం పెంచడం కల్పించడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 28 అన్నారు, బీసీ ఎస్సీ ఎస్టీ 1, 25 రూపాయలు, ఓసీలకు 200 రూపాయలు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె వివరించారు. ఇట్టి అవకాశాన్ని ధన్వాడ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సద్వినియోగం చేసుకోవాలని, తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఆమె కోరారు.

# సంత్ సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** నియోజకవర్గంలో ఈ నెల 23న జరగనున్న "శ్రీ శ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287 జయంతిని జయప్రదం చేయాలని సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు కొర్ర నాగు నాయక్, తాజా మాజీ ఎంపిపి రవితేజ నాయక్ కోరారు. శనివారం పట్టణంలోని ఎఫ్ సిఐలో హమాలీలకు సేవాలాల్ జయంతి ఉత్సవాల గురించి ఆహ్వాన పత్రాలు అందించి, కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అత్యంత వైభవంగా నిర్వహించబడే సేవాలాల్ జయంతి ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో పాల్గొని, బోగ్ బండారూ కార్యక్రమంలో పాల్గొనాలని, స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని సూచించారు. గిరిజన వేషాధారణ, డప్పు వాయిద్యాలు, కోలాట బృందాలతో ఎంపిడిఓ కార్యాలయం నుండి బంజారా భవనం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు దాస్య నాయక్, భాస్కర్ నాయక్, బాలాజీ నాయక్, విజయ్ నాయక్, బాల నాయక్ తదితరులు పాల్గొన్నారు.







# కోరుట్ల మున్సిపాలిటీలో ఎగిరిన కాంగ్రెస్ జెండా

### కోరుట్లలో వారు వన్ సైడ్

**నేటి సాక్షి, కోరుట్ల అర్బన్ (వీఆర్ ధర్మేంద్ర):** కోరుట్ల నియోజకవర్గ మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కృత నిశ్చయంతో రంగంలోకి దిగిన జువాడి నరసింహారావు వ్యూహం తీవ్ర ఉత్కంఠ నడుమ ఫలించింది. కోరుట్ల మున్సిపాలిటీలో మొత్తం 33 వార్డుల్లో కాంగ్రెస్ 18 గెలిచి సంపూర్ణ మెజార్టీ సాధించింది టిఆర్ఎస్ 8 బిజెపి 6 ఇండిపెండెంట్ 1 స్థానంలో గెలిచారు కాంగ్రెస్ చైర్మన్ పీఠం ఎలాగైనా కైవసం చేసుకోవాలనే ఉద్దేశంతో జువ్వడి వ్యూహాలు చేసి తనదైన ముద్ర వేసుకున్నారు 18 మందితో కాంగ్రెస్ కౌన్సిలర్లతో పాటు ఇండిపెండెంట్గా గెలిచిన కౌన్సిలర్లను తన గూటికి చేర్చుకొని పార్టీకి విధేయుడుగా ఉంటున్న తిరుమల గంగాధర్ భార్య తిరుమల వసంతను చైర్పర్సన్ గా చేశారు దీనితో కోరుట్ల బల్దియపై కాంగ్రెస్ జెండా ఎగరవేసి జువ్వాడి తన మార్కును చాటుకున్నారు.

# తిరుగుడు కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలి

### కోరుట్ల కమిషనర్ రవీందర్‌కు 27వ వార్డు వాసి అజయ్ వినతి

**నేటి సాక్షి, కోరుట్ల(రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని 27వ వార్డులో తిరుగుడు కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ వార్డు నివాసి అజయ్ మున్సిపల్ కమిషనర్ రవీందర్‌కు వినతి పత్రం సమర్పించారు. రజక సంఘం కార్యాలయం నుండి అయ్యప్ప వెల్డింగ్ షాప్ వరకు తిరుగుడు కుక్కలు సంచరిస్తూ ప్రజలకు భయాందోళన కలిగిస్తున్నాయని అజయ్ వినతిపత్రంలో పేర్కొన్నారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాబట్టి సంబంధిత సిబ్బందిని ఆదేశించి తిరుగుడు కుక్కలను పట్టించి, సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని అజయ్ మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ప్రజల భద్రత దృష్ట్యా తక్షణ చర్యలు అవసరమని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నేడు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

**నేటి సాక్షి, నారాయణపేట(ఇమామ్ సాబ్):** విద్యార్థిని విద్యార్థులకు తెలియజేయడం ఏమనగా రేపు అనగా 22 /02/2026 రోజు ఆన్లైన్ ఎగ్జామ్స్ ఉంటుంది కాబట్టి ఓపెన్ టెన్త్, ఇంటర్ సీఈసీ,హెచ్ఈసి, ఎంపీసీ, బైపీసీ గ్రూపులందరికీ కూడా బేస్‌లైన్ టెస్ట్ ఉంటుంది కాబట్టి ఓపెన్ టెన్త్, ఇంటర్లో జాయిన్ అయినా ప్రతి ఒక్క విద్యార్థి విద్యార్థినిలు ఈ ఎగ్జామ్స్ కంపల్సరీ అటెండ్ కావాల్సిందిగా కోరుతున్నాము రేపు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఆన్లైన్ ఎగ్జామ్ ఉంటుంది కాబట్టి విద్యార్థులు వచ్చే ముందు తమ తమ సెల్ఫోన్ స్మార్ట్ ఫోన్ తీసుకొని సెంటర్ దగ్గర రావాల్సిందిగా కోరుతున్నాము. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శ్రీ శివయ్య , నారాయణపేట జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, సెంటర్ కోఆర్డినేటర్ కే చెన్నారెడ్డి శ్రీ వెంకట సాయి హై స్కూల్ మరికల్ ఒక ప్రకటనలో తెలిపారు.

# ధన్వాడ తాసిల్దార్‌కు నిరుద్యోగుల వినతి



**నేటి సాక్షి, నారాయణపేట(ఇమామ్ సాబ్ ):** కులము ఆదాయము నాన్ క్రిమి లేయర్ సర్టిఫికెట్లు సకాలంలో ఇవ్వాలని ఎమ్మార్వో గారికి నిరుద్యోగ జేఏసీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు.. సందర్భంగా జేఏసీ నాయకులు కుజూరత్అలి,మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈనెల 25వ తారీకు వరకు ఓటిఆర్ వన్ టైం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిబంధన విధించడం జరిగింది. కావున మండలంలోని వివిధ గ్రామాల నిరుద్యోగులు కులము ఆదాయము నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్ల కోసం రోజుల తరబడి ఎదురు చూడవలసిన పరిస్థితి ఏర్పడింది కావున మండలంలోని నిరుద్యోగ యువకులకు సకాలంలో కులము,ఆదాయం, నాన్ క్రిమి లేయార్ సర్టిఫికెట్ కోసం ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా మంజూరు చేయాలని అదేవిధంగా సర్టిఫికెట్ కోసం నిరుద్యోగ యువకులకు ఇబ్బంది కలగకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్వో సింధుజ గారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జాక్ నాయకులు బాలకృష్ణ, సుధాకర్, శ్రీను, విజయ్ కుమార్, నందకిషోర్ తేజ, యువకులు విద్యార్థులు పాల్గొన్నారు.




# నా స్టైలే ఇంత..

# మైండ్‌సెట్ మార్చుకోను!

## హ్యాట్రిక్ డకౌట్‌లపై అభిషేక్ శర్మ షాకింగ్ రియాక్షన్

**ఢిల్లీ:** అభిషేక్ శర్మ అంటేనే ప్రత్యర్థి జట్టుకు చుక్కలు చూయిస్తాడని నమ్మకం. ఓపెనర్‌గా రంగంలోకి దిగి బౌలర్లకు చుక్కలు చూయిస్తాడు. అయితే.. తాజాగా జరుగుతున్న టీ20 వరల్డ్ కప్‌లో మాత్రం సీన్ రివర్స్ అయ్యింది. మూడు మ్యాచుల్లో అభిషేక్ డకౌట్ అయ్యాడు. దీంతో అనేక విమర్శలను ఎదుర్కొన్నాడు అభిషేక్.. ఆదివారం దక్షిణాఫ్రికాతో జరగనున్న భారత్ తొలి సూపర్ ఎయిట్ మ్యాచ్‌కు ముందు తన ఆటతీరుపై అభిషేక్ స్పందించాడు. గత మూడు ఇన్నింగ్స్‌లలో తాను ఎలాంటి పరుగులు చేయకపోయినా సరే, తన ఆడే విధానాన్ని (ఇంటెంట్), తన ప్రిపరేషన్ ప్రాసెస్‌ను ఏమాత్రం మార్చుకోబోనని స్పష్టం చేశాడు. స్టార్ స్పోర్ట్స్ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేసిన ఓ వీడియోలో అభిషేక్ మాట్లాడుతూ.. "నేను నా బ్యాటింగ్‌ను ఎప్పుడూ ఆస్వాదిస్తాను. రెండేళ్ల క్రితమే నేను ఒత్తిడి తీసుకోవడం మానేశాను. ఎందుకంటే కేవలం ప్రాసెస్ మాత్రమే నా చేతుల్లో ఉంటుందని నేను బలంగా నమ్ముతాను. అది ప్రాక్టీస్ అయినా, ట్రైనింగ్ అయినా సరే దాన్ని నేను కచ్చితంగా చేస్తాను, భవిష్యత్తులో కూడా చేస్తూనే ఉంటాను. నా ప్రాసెస్‌ను, మైండ్‌సెట్‌ను నేనెప్పటికీ మార్చుకోను" అని తేల్చి చెప్పాడు.

ఒక బ్యాటర్ కెరీర్‌లో ఎత్తుపల్లాలు సహజమని అభిషేక్ ఈ వీడియోలో వెల్లడించాడు. ఫామ్ గురించి అనవసరమైన ఒత్తిడికి గురికావడం మానేశానని స్పష్టం చేశాడు. ఇటీవల తన ప్రదర్శన గురించి ఆందోళన చెందకుండా కేవలం తన ప్రాసెస్ పైనే దృష్టి పెడతానని తెలిపాడు. "ఎలాంటి ఒత్తిడి తీసుకోకపోవడాన్ని నేను ఎంజాయ్ చేస్తున్నాను. బ్యాటర్‌గా ఎప్పుడూ ఎత్తుపల్లాలు ఎదురవుతూనే ఉంటాయి. కొన్నిసార్లు బాగా పరుగులు చేస్తాం, కొన్నిసార్లు అస్సలు చేయలేం. కానీ, నేను కచ్చితంగా ఇలాగే, ఇదే ఉద్దేశంతో (ఇంటెంట్) ఆడాలని వ్యక్తిగతంగా ఒక దశలో నిర్ణయించుకున్నాను. ఇది అన్ని సందర్భాల్లోనూ నాకు సానుకూల ఫలితాలను ఇవ్వకపోవచ్చు, కానీ నా ఇంటెంట్ లేదా ప్రాసెస్‌ను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చుకోబోను" అని వివరించాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోను చూసిన అభిమానులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు అభిషేక్ వ్యాఖ్యలను సమర్థిస్తుంటే.. మరి కొందరు మత్రం ఇక ముందు మ్యాచుల్లో అభిషేక్‌ను పక్కన పెట్టడమే మంచిదని సలహా ఇస్తున్నారు.

# రెండో పెళ్లి చేసుకున్న మాజీ ఓపెనర్

**ఢిల్లీ:** భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ రెండో పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్యతో విడాకుల అనంతరం పరిచయమైన సోఫీ షైన్ ని అతడు వివాహమాడాడు. కొన్నాళ్లుగా సోఫీతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్న ధావన్ శనివారం సన్నిహితుల సమక్షంలో ఆమె మెడలో మూడు ముళ్లు వేశాడు. కొత్త జంటకు పలువురు క్రికెటర్లు, సెలబ్రిటీలు శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ కొత్త జీవితం ఆరంభించాడు. రెండోసారి ప్రేమలో పడిన అతడు.. సోఫీ షైన్‌ను పెళ్లి చేసుకున్నాడు. ఫిబ్రవరి 20 మెహందీ, సంగీత్ వేడుకలు ముగియడంతో.. ఫిబ్రవరి 21 శనివారం ఈ జంట వివాహ బంధంలో అడుగుపెట్టింది. సన్నిహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో సందడిగా, సంబురంగా జరిగిన వీరి పెళ్లి ఫొటోలను భారత క్రికెటర్ యజ్వేంద్ర చాహల్ పంచుకున్నాడు. భారతీయ సంప్రదాయ దుస్తుల్లో తళుక్కుమన్న ఈ కొత్త జంటకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

### ఎవరీ సోఫి

మోడల్‌ను తలపించే అందగత్తె సోఫీ షైన్  సొంత దేశం ఐర్లాండ్. కాస్లేట్రోయ్ కాలేజీలో చదివిన ఈ అందగత్తె ఆ తర్వాత మార్కెటింగ్, మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ పూర్తి చేసింది. ప్రస్తుతం సోఫియా ప్రొడక్ట్ కన్సల్టెంట్‌గా పని చేస్తోంది. అబుదాబీలోని నార్తర్న్ ట్రస్ట్ కో-ఆపరేషన్ సంస్థ-లో ఉపాధ్యక్షురాలిగా సేవలందిస్తోందీ ముద్దుగుమ్మ. ఈ బ్యూటీకి సోషల్ మీడియాలో లక్ష 34 వేలమంది ఫాలోవర్లు ఉన్నారు. దుబాయ్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ జరిగినప్పటి నుంచి జంటగా కనిపించిన ధావన్, సోఫీయాలు ఎట్టకేలకు పెళ్లితో తమ అనుబంధాన్ని శాశ్వతం చేసుకున్నారు.





# పాక్ కొంప ముంచిన వర్షం

## న్యూజిలాండ్ మ్యాచ్ రద్దు..

## ఇక ఇదే లాస్ట్ ఛాన్స్!




**కొలంబో:** వర్షం పాకిస్థాన్ కొంప ముంచింది. శనివారం శ్రీలంక రాజధాని కొలంబోలో జరగాల్సిన పాకిస్థాన్ జం న్యూజిలాండ్ టీ20 వరల్డ్ సూపర్ ఎయిట్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. ఈ మ్యాచ్‌కు రిజర్వ్ డే సైతం లేదు. దీంతో చేసేదేమి లేక రెండు జట్లకు ఒక్కో పాయింట్ ఇచ్చారు. వర్షం కారణంగా ఇరు దేశాలకు గడ్డు కాలంగా మారింది. సెమీఫైనల్ అవకాశాలు సన్నగిల్లాయి. పాకిస్థాన్ ఇప్పుడు ఇంకా రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇంగ్లాండ్, శ్రీలంకలతో పాక్ పోటీ పడాల్సి ఉంది. సల్మాన్ అలీ ఆఘా సారథ్యంలోని జట్టు ఈ రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే మొత్తం 5 పాయింట్లతో సెమీఫైనల్‌కు చేరే అవకాశాలు బలంగా ఉంటాయి. ఒకటి గెలిచి, ఒకటి ఓడితే 3 పాయింట్లతో ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. రెండు మ్యాచ్‌లూ ఓడిపోతే పాకిస్థాన్ ఇంటి బాట పట్టాల్సిందే. అయితే.. నేడు స్వల్పంగా వర్షం పడుతుండగా టాస్ ముగిసింది. టాస్ గెలిచిన పాకిస్థాన్ బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే ఆ తేలికపాటి జల్లులు క్రమంగా భారీ వర్షంగా మారడంతో ఒక్క బంతి కూడా వేయకుండానే అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేశారు. ఈ మ్యాచ్ కోసం పాకిస్థాన్ తమ జట్టులో ఒక మార్పు సైతం చేసింది. ఖవాజా నఫాయ్ స్థానంలో ఫఖర్ జమాన్‌ను తుదిజట్టులోకి తీసుకుంది. న్యూజిలాండ్ మాత్రం మూడు మార్పులతో బరిలోకి దిగింది. కెనడాతో జరిగిన మ్యాచ్‌ను అనారోగ్యం కారణంగా మిస్ చేసిన కెప్టెన్ మిచెల్ సాంట్నర్ తిరిగి జట్టులో చేరాడు. అతనితో పాటు లాకీ ఫర్గూసన్, ఇష్ సోధీకి కూడా అవకాశం ఇచ్చారు. ఈ మ్యాచ్ రద్దవ్వడంతో పాకిస్థాన్ డీలా పడింది. ఇక ఫిబ్రవరి 24న ఇదే వేదికలో ఇంగ్లాండ్‌తో, ఫిబ్రవరి 25న న్యూజిలాండ్‌ను దాయాది జట్టు ఎదుర్కోనుంది. దాయాది జట్టు ఇంటికి పయనమవుతుందా? రెండు మ్యాచ్‌లు గెలిచి సెమీస్ ఆడుతుందా? అనే అంశంపై అభిమానులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

# పదేళ్ల తర్వాత హిస్టరీ రిపీట్!

## ఆసీస్ గడ్డపై గర్జించిన భారత మహిళలు




**ఢిల్లీ:** ఆస్ట్రేలియా గడ్డపై భారత లేడీ సింగాలు గర్జించారు. కంగారూ సొంత గడ్డలో ఆ టీమ్‌ను 17 పరుగుల తేడాతో ఓడించారు. ఆస్ట్రేలియా గడ్డపై రెండోసారి టీ20 సిరీస్ గెలిచింది భారత మహిళల జట్టు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుంది. ఇంతకుముందు 2016లో తొలిసారి ఈ ఘనత సాధించిన ఉమెన్స్ టీమ్, తాజాగా మళ్ళీ చరిత్రను పునరావృతం చేసింది. ముందుగా టాస్ గెలిచిన టీమిండియా బ్యాటింగ్ ఎంచుకుంది. 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 176 పరుగుల చేసింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన కేవలం 55 బంతుల్లోనే 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 82 పరుగులు స్కోర్ చేసి జట్టును నిలబెట్టింది. 149.09 స్ట్రైక్ రేట్‌తో ఆడింది. నెమ్మదిగా ఇన్నింగ్స్ ప్రారంభించి ఆ తర్వాత గేర్ మార్చింది మంధాన.. మెంబర్స్ స్టాండ్‌లోకి కొట్టిన ఓ భారీ సిక్సర్ హైలైట్‌గా నిలిచింది. పేసర్ డార్సీ బ్రౌన్ బౌలింగ్‌లో సిక్సర్ బాది 38 బంతుల్లోనే తన హాఫ్ సెంచరీని పూర్తి చేసుకుంది. తన 160వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న ఆమెకు ఇది 33వ అర్ధశతకం.

ఓపెనర్ షఫాలీ వర్మ (7) త్వరగానే అవుటైనప్పటికీ, జెమీమా రోడ్రిగ్స్‌తో (46 బంతుల్లో 4 ఫోర్లతో 59 పరుగులు) కలిసి మంధాన ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. ఈ జోడి రెండో వికెట్‌కు ఏకంగా 121 పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించింది. కేవలం 66 బంతుల్లోనే వీరిద్దరూ సెంచరీ భాగస్వామ్యాన్ని సాధించి చివర్లో భారీ స్కోరుకు బాటలు వేశారు. జెమీమా ఎంతో సంయమనంతో ఆడగా, మంధాన తన క్లాస్ షాట్లతో అలరించింది. అయితే చివర్లో ఈ ఇద్దరూ అన్నాబెల్ సదర్లాండ్ (2/34) బౌలింగ్‌లోనే వెనుదిరిగారు. ఆ తర్వాత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ వ్యూహాత్మకంగా రిచా ఘోష్‌ను నాలుగో స్థానంలో పంపగా.. ఆమె ఆ నమ్మకాన్ని నిలబెడుతూ కేవలం 7 బంతుల్లోనే వేగంగా 18 పరుగులు చేసి జట్టు స్కోరును 175 దాటించింది. లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా ఏ దశలోనూ కుదురుకున్నట్లు కనిపించలేదు. ఆష్లీ గార్డనర్ (45 బంతుల్లో 57 పరుగులు) ఒంటరి పోరాటం చేసినప్పటికీ, మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో ఆసీస్ జట్టు 159/9 స్కోరుకే కుప్పకూలింది. భారత బౌలర్ల క్రమశిక్షణతో కూడిన బౌలింగ్ ముందు ఆతిథ్య జట్టు తలవంచింది. లెగ్ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ అద్భుత స్పెల్‌తో 22 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, అరంగేట్రం చేసిన శ్రీ చరణి 32 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు తీసి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పింది. అరుంధతి రెడ్డి కూడా 35 పరుగులిచ్చి 2 వికెట్లు తీసి ఆసీస్ బ్యాటర్ల మధ్య పెద్ద భాగస్వామ్యాలు నమోదు కాకుండా అడ్డుకుంది. ఎట్టకేలకు పదేళ్ల తర్వాత మహిళల జట్టు రికార్డును పునరావృతం చేసింది.

# అంధుల క్రికెట్‌కు అండగా..

## బీసీసీఐ కీలక నిర్ణయం




**ముంబయి:** ఇటీవలి కాలంలో అంధుల క్రికెట్‌లోనూ టీమ్‌ఇండియా ప్లేయర్లు అద్భుతాలు సృష్టిస్తున్నారు. ఇటు పురుషుల జట్టుతోపాటు మహిళా జట్టు వరల్డ్ కప్‌లను గెలిచి సత్తా చాటారు. అయితే, వారికి అందే అరకొర సాయంతోనే ఇన్నాళ్లూ నెట్టుకొచ్చారు. ఏదైనా టోర్నీలో విజేతగా నిలిస్తేనే ఆ ప్లేయర్లకు నగదు అందుతోంది. దీంతో కొందరు ఉద్యోగాలు చేసుకుంటూనే మ్యాచులకు సిద్ధం కావాల్సిన పరిస్థితి ఉంది. ఇక నుంచి ఆ కష్టాల నుంచి భారత అంధుల క్రికెట్ బయటపడబోతోంది. దానికి కారణం ప్రపంచంలోనే అత్యంత ధనిక బోర్డు బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. మెరుగైన అవకాశాలు కల్పించడం, క్రికెట్ వృద్ధి కోసం సాయం చేసేందుకు ముందుకొచ్చింది. ప్రస్తుత ఐసీసీ ఛైర్మన్ జైషా బీసీసీఐ సెక్రటరీగా ఉన్నప్పుడే ఈ విధానానికి శ్రీకారం చుట్టారు.

### బీసీసీఐ సాయం ఇలా..

విదేశాల్లో రెండు అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనేందుకు అవసరమైన ప్రయాణ సదుపాయాలను కల్పించడం. స్వదేశం వేదికగా జరిగే ద్వైపాక్షిక సిరీసుల్లో పాల్గొనే భారత్, పర్యాటక ప్లేయర్లకు వసతి సదుపాయం. బీసీసీఐకి సంబంధించిన వేదికలను వాడుకొనేందుకు అవకాశం. దేశవాళీ, అంతర్జాతీయ మ్యాచులు ఆడే సదుపాయం. ఆటకు సంబంధించి అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన పరిస్థితులను కల్పించడం.

# 'నా వాడు.. లక్కీ గర్ల్ నేనే'

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ప్రేమలో మునిగితేలుతున్నాడు. భార్య నటాషా స్టాంకోవిక్‌తో విడిపోయిన ఈ బరోడా క్రికెటర్‌కు మహీక శర్మ రూపంలో కొత్త ప్రేమ దొరికింది. గతేడాది తమ బంధాన్ని బహిర్గతం చేసిన హార్దిక్- మహీక అప్పటి నుంచి రొమాంటిక్ పోస్టులతో సోషల్ మీడియాను నింపేస్తున్నారు. ప్రస్తుతం హార్దిక్ పాండ్యా టీ20 ప్రపంచకప్-2026 టోర్నమెంట్‌తో బిజీగా ఉన్నాడు. ఆల్‌రౌండ్ ప్రతిభతో రాణిస్తూ టీమిండియా విజయాల్లో తన వంతు పాత్ర పోషిస్తున్న హార్దిక్.. ప్రియురాలు మహీక పుట్టినరోజును ఇటీవల ఘనంగా సెలబ్రేట్ చేశాడు. హార్దిక్‌తో కలిసి దిగిన ఫొటోలు పంచుకుంటూ.. "ఐ లవ్ మై మ్యాన్. నా జీవితంలో ఇప్పటి వరకు ఇదే అత్యుత్తమైన పుట్టినరోజు. థాంక్యూ బేబీ. ఈ ప్రపంచంలో అందరికంటే అదృష్టవంతురాలైన అమ్మాయిని నేనే" అంటూ హార్దిక్‌తో దిగిన ఫొటోలను షేర్ చేసింది.




# అల్లు అర్జున్ ప్రైవేట్ పార్టీలో రామ్ చరణ్-ఉపాసన



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ – మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ చాలా నెలల తర్వాత ఒకే ఫ్రేమ్‌లో మెరిశారు. అల్లు శిరీష్ ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ లో భాగంగా బన్నీ ఏర్పాటు చేసిన ప్రైవేట్ పార్టీలో రామ్ చరణ్ ఉపాసన దంపతులు సందడి చేశారు. కాబోయే వధూవరులు అల్లు శిరీష్ – నయనికలతో బన్నీ – చెర్రీ కలిసి దిగిన ఓ పిక్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ 'మెగా – అల్లు' కలయిక అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.అల్లువారబ్బాయి శిరీష్ మరికొన్ని రోజుల్లో ఓ ఇంటివాడు కాబోతున్న సంగతి తెలిసిందే. ప్రేయసి నయనికతో ఏడడుగులు వేయబోతున్నాడు. ఇప్పటికే అల్లు ఫ్యామిలీలో పెళ్లి సందడి మొదలైపోయింది. ఇటీవల అల్లు సోదరులు దుబాయ్ లో గ్రాండ్ గా పార్టీ నిర్వహించారు. హైదరాబాద్ లోని అల్లు వారి నివాసంలో పసుపు దంచే కార్యక్రమంతో పెళ్లి పనులు మొదలుపెట్టారు. తమ్ముడు వివాహం సందర్భంగా అల్లు అర్జున్ తాజాగా ఓ ప్రైవేట్ పార్టీ ఏర్పాటు చేయగా.. దానికి రామ్ చరణ్ హాజరవ్వడం అందరి దృష్టిని ఆకర్షించింది. మరికొన్ని రోజుల్లో అల్లు శిరీష్ పెళ్లి పీటలు ఎక్కబోతున్న నేపథ్యంలో, అల్లు అర్జున్ తన ఫామ్ హౌస్ లో శుక్రవారం రాత్రి గ్రాండ్ ప్రీవెడ్డింగ్ పార్టీ నిర్వహించారు. కుటుంబ సభ్యులు, ఇండస్ట్రీలోని అత్యంత సన్నిహితులు ఈ పార్టీకి అటెండ్ అయ్యారని తెలుస్తోంది. ఈ వేడుకకు రామ్ చరణ్ తన భార్య ఉపాసనతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్, రామ్ చరణ్ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకోవడమే కాకుండా, కలిసి ఫోటోలకు పోజులిచ్చారు. కాబోయే వధూవరులు అల్లు శిరీష్ – నయనికలతో అల్లు అర్జున్ – స్నేహా రెడ్డి, రామ్ చరణ్ – ఉపాసన దంపతులు కలిసి ఫోటో దిగారు. ఈ పిక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో అల్లు – మెగా ఫ్యామిలీ మెంబెర్స్ బ్లాక్ డ్రెస్సుల్లో మెరిశారు. దీక్షలో ఉన్న చరణ్.. చెప్పులు లేకుండా సింపుల్ గా నిలబడి ఉన్నారు. మిగతా వారు మాత్రం మోడరన్ డ్రెస్సుల్లో కనిపిస్తున్నారు. ఈ ఫోటో నెట్టింట సందడి చేస్తోంది. చాలా కాలం తర్వాత బన్నీ – చెర్రీ ఒకే ఫ్రేమ్‌లో కనిపించడంతో అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. తెలుగు చిత్ర పరిశ్రమలో 'మెగా' & 'అల్లు' కుటుంబాలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. గత కొంతకాలంగా ఈ రెండు కుటుంబాల మధ్య దూరం పెరిగిందని, ముఖ్యంగా రామ్ చరణ్ – అల్లు అర్జున్ మధ్య కోల్డ్ వార్ నడుస్తోందని సోషల్ మీడియాలో రకరకాల ప్రచారాలు సాగుతున్నాయి. అయితే సందర్భం వచ్చినప్పుడల్లా ఇరు వర్గాలు ఆ పుకార్లకు ఫుల్ స్టాప్ పెడుతూ వస్తున్నారు. అల్లు శిరీష్ ఎంగేజ్మెంట్ కి మెగా ఫ్యామిలీ మొత్తం హాజరైంది. ఇటీవల చరణ్ – ఉపాసన దంపతులకు కవలలు పుడితే, వారికి బన్నీ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఇప్పుడు బన్నీ ఏర్పాటు చేసిన పార్టీలో చెర్రీ – ఉపాసనలు సందడి చేశారు.




# స్టార్ హీరోయిన్లకు మించిన క్రేజ్



ప్రస్తుతం తెలుగు బుల్లితెరపై దూసుకుపోతున్న సీరియల్ గుండె నిండా గుడిగంటలు. అత్యధిక టీఆర్పీ రేటింగ్‌తో ఈ సీరియల్ రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఫ్యామిలీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సాధారణ మధ్య తరగతి కుటుంబ కథతో సాగుతున్న ఈ సీరియల్ ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుంది. అందుకే ఈ సీరియల్ కు రోజు రోజుకీ విపరీతమైన రెస్పాన్స్ వస్తుంది. ఇక ఇందులో ప్రధాన పాత్రలు బాలు, మీనా జోడికి సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉందంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా మీనా గురించి చెప్పుకుంటే.. అందంతోపాటు పద్దతిగా చీరకట్టులో కనిపిస్తూ అద్భుతమైన నటనతో కట్టిపడేస్తుంది. మీనా అసలు పేరు అమూల్య గౌడ. కన్నడ సినీరంగానికి చెందిన ఈ ముద్దుగుమ్మకు తెలుగులో ఫాలోయింగ్ ఎక్కువే. సీరియల్లో పద్దతిగా కనిపించే అమూల్య.. సోషల్ మీడియాలో మాత్రం గ్లామరస్ ఫోటోలతో రచ్చ చేస్తుంది. నెట్టింట ఈ అమ్మడు చేసే అరాచకం గురించి చెప్పక్కర్లేదు. మైసూర్ కు చెందిన అమూల్య గౌడ.. దాదాపు పదేళ్ల క్రితం సినీప్రయాణం స్టార్ట్ చేసింది. కన్నడ సీరియల్ స్వాతి ముత్తుతో నటిగా తెరంగేట్రం చేసింది. ఆ తర్వాత కోమలి సీరియల్ ద్వారా ఫేమ్ సంపాదించుకుంది. కన్నడలో పలు సీరియల్స్ చేసిన ఈ అమ్మడు.. కార్తీక దీపం సీరియల్లో శౌర్య పాత్రతో తెలుగు అడియన్స్ ముందుకు వచ్చింది. ఇందులో రౌడీ బేబీగా మరింత పాపులర్ అయ్యింది.ఆ తర్వాత గుండె నిండా గుడిగంటలు సీరియల్లో మీనా పాత్రతో మరింత పాపులర్ అయ్యింది. ఈ సీరియల్ ఆమె కెరీర్ టర్నింగ్ పాయింట్ అయ్యింది. ప్రస్తుతం ఈ సీరియల్ విజయవంతంగా దూసుకుపోతుంది. ఇక ఇప్పుడు ఆమె సోషల్ మీడియాలో గ్లామర్ లుక్స్ తో హీటెక్కిస్తుంది. ఇదిలా ఉంటే.. అమూల్య గౌడ ఒక్క ఎపిసోడ్ కోసం రూ.30 నుంచి రూ.35 వేలు తీసుకుంటుందట. ఇప్పుడు ఈ విషయం తెలిసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు.

# కోటి పారితోషికం





'ధమాకా' తర్వాత హీరోయిన్ గా శ్రీలీల ఖాతాలో ఒక్క హిట్టు కూడా పడలేదు. బాలకృష్ణ- అనిల్ రావిపూడి కాంబినేషన్లో వచ్చిన 'భగవంత్ కేసరి' హిట్ అయినా.. అందులో శ్రీలీల హీరోయిన్ కాదు. అయినప్పటికీ దాని సక్సెస్ క్రెడిట్ శ్రీలీల ఖాతాలో పడలేదు. 'స్కంద' 'ఆదికేశవ' 'ఎక్స్ట్రా ఆర్డియనరీ మెన్' 'గుంటూరు కారం' 'రాబిన్ హుడ్' 'జూనియర్' 'మాస్ జాతర' 'పరాశక్తి' ఇలా అన్నీ డిజాస్టర్లే. వేరే హీరోయిన్ ట్రాక్ రికార్డు ఇలా ఉంటే.. ఈపాటికి దుకాణం సర్దేసేది. కానీ శ్రీలీల ఆ విషయంలో లక్కీ అనే చెప్పాలి. ఇన్ని డిజాస్టర్లు పడినప్పటికీ.. ఆమె డిమాండ్ ఏమీ తగ్గలేదు. ఇప్పటికీ ఆమె కోటి రూపాయలు పారితోషికం అందుకుంటుంది. ప్రస్తుతం ఆమె హిందీలో 2 సినిమాల్లో నటిస్తుంది.అవి రెండూ క్రేజీ ప్రాజెక్టులే. మరోవైపు తమిళంలో క్రేజీ ఆఫర్లు అందుకుంటుంది. ధనుష్ 50వ సినిమాలో సాయి పల్లవితో పాటు మరో హీరోయిన్ గా నటిస్తుంది. అలాగే అజిత్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో కూడా హీరోయిన్ గా నటిస్తుంది.మరోవైపు పవన్ కళ్యాణ్ కి జోడీగా 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలో నటించింది. హరీష్ శంకర్ దర్శకత్వం వహించిన సినిమా అది. మార్చి 26న రిలీజ్ అవుతుంది. ఈ సినిమాకి సంబంధించి శ్రీలీల తన పాత్రకి డబ్బింగ్ చెప్పడం కూడా పూర్తయ్యింది. ఈ ఒక్క సినిమా హిట్ అయితే.. శ్రీలీల ఫ్లాప్స్ నుండి బయటపడినట్టే. దర్శకుడు హరీష్ శంకర్ కి కూడా ఫ్లాప్స్ లో ఉన్న హీరోయిన్స్ ని బయటపడేసిన ట్రాక్ రికార్డ్ ఉంది. సో శ్రీలీలకి గుడ్ టైమ్ స్టార్ట్ అయినట్టే...!

# పవర్‌ఫుల్ లాయర్‌గా తాప్సీ

ఒకప్పుడు తన అందాలతో తెలుగు ప్రేక్షకులను అలరించారు ఉత్తరాది భామ తాప్సీ పన్ను. కానీ అందరు హీరోయిన్ల మాదిరిగానే ఆమెకు బాలీవుడ్‌పై మోజు పుట్టి అక్కడే సెటిలైపోయింది. ఒకటి రెండు హిట్లు తప్పించి హిందీ చిత్ర పరిశ్రమలో తాప్సీ కెరీర్‌లో పెద్దగా మెరుపులు లేవు. కానీ ఏదో కిందా మీదా పడుతూ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు తాప్సీ. దోబారా, తడ్కా, బ్లర్, ధక్ ధక్, డూంకీ, ఖేల్ ఖేల్ మై తదితర సినిమాలలో ఆమె నటించారు. తాజాగా తాప్సీ పన్ను లీడ్ రోల్‌లో నటించిన చిత్రం అస్సీ. మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాల బ్యాక్‌డ్రాప్‌లో యదార్థ ఘటనల తెరకెక్కిన లేడీ ఓరియెంటెడ్ మూవీ అస్సీ. కోర్ట్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రంలో తాప్సీ పన్ను పవర్‌ఫుల్ లాయర్‌గా నటించారు. ఫిబ్రవరి 20వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చింది. టీ సిరీస్ ఫిల్మ్స్, బెనారస్ మీడియా వర్క్స్ బ్యానర్‌పై భూషణ్ కుమార్, కృషన్ కుమార్, అనుభవ్ సిన్హాలు సంయుక్తంగా అస్సీ మూవీని నిర్మించగా.. అనుభవ్ సిన్హా దర్శకత్వం వహించారు. తాప్సీతో పాటు కని కుస్రుతి, రేవతి, మనోజ్ పహ్వా, కుముద్ మిశ్రా, మహమ్మద్ జీషన్ ఆయూబ్, సత్యజిత్ శర్మ, విపుల్ గుప్తా తదితరులు కీలకపాత్రలు పోషించారు. సీతా పహ్వా, సుప్రియ పాఠక్, నసీరుద్దీన్ షాలు గెస్ట్ రోల్‌లో అలరించారు. ఈవారం ముల్లిగన్ ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించగా.. అమర్జిత్ సింగ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. రంజిత్ బరత్ సంగీత దర్శకత్వం వహించారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల పారితోషం, ప్రొడక్షన్ కాస్ట్, ప్రమోషనల్ కార్యక్రమాలతో కలిపి అస్సీ మూవీకి 40 కోట్ల రూపాయల బడ్జెట్ అయ్యింది. టీజర్, ట్రైలర్ తదితర ప్రమోషనల్ కార్యక్రమాలతో అస్సీ మూవీకి ఓ మాదిరిగా థియేట్రికల్, నాన్ థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా లాభాల్లోకి రావాలంటే బాక్సాఫీస్ వద్ద 80 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ రాబట్టాల్సి ఉందని ట్రేడ్ పండితులు వాల్యూ నిర్దేశించారు.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# ప్రజావాణి యధాతధం: కలెక్టర్



**నేటి సాక్షి, మంచిర్యాల :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 23వ తేదీ నుండి జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో యధాతధంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించాలని, తమ సమస్యలపై దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు.

# బుద్ధునితో నా ప్రయాణం నాటకాన్ని విజయవంతం చేద్దాం

**డా.మువ్వా రామారావు, డా.జాడి రాజు**



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** పట్టణంలోని కళాభారతిలో మార్చి 3న సాయంత్రం నిర్వహించనున్న బుద్ధునితో నా ప్రయాణం నాటకాన్ని పరిసర ప్రజలంతా విజయవంతం చేయాలని నిర్వాహకులు డాక్టర్ మువ్వా రామారావు, సామాజిక వెత్త జాడి రాజు అన్నారు. శనివారం పట్టణంలోని కళాభారతి వద్ద పోస్టర్, కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బుద్ధుని యొక్క శాంతి మార్గాన్ని స్వీకరించిన అంబేద్కర్ గురించి అద్భుతంగా అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారు ప్రదర్శించడం జరుగుతుందని, ఈ సదవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు ఉచితంగా ఉపయోగించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూరి ప్రభాకర్ కందుకూరి సుదర్శన్, వెంకటేష్ లక్ష్మణ్ వినయ్ కుమార్, రామయ్య తాళ్లపల్లి రాములు సుదర్శన్ రెడ్డి, జయరాజు, బి నరేష్ పున్న రాములు మారం శ్రీనివాస్, పరిమితి రామావతారం, శ్రీరాములు గౌడ్, గుడిపాటి వెంకటేశ్వర్లు, దారం మల్లేష్ యాదవ్, బిక్షమయ్య, కోడిరెక్క సురేష్, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర స్వచ్ఛ రథం ప్రారంభం



**నేటి సాక్షి, పాములపాడు :** పాములపాడు మండల కేంద్రంలో ఎంపిడిఓ ఆఫీసు నందు స్వచ్ఛ రథం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య అతిథిగా స్పెషల్ అధికారి రాజు పాల్గొన్నారు. స్పెషల్ అధికారి రాజు మాట్లాడుతూ పరిశుభ్రత పరిశుద్ధానికి ప్రాధాన్యత ఇచ్చి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించుకొని పరిసరాలలో ప్లాస్టిక్ రహీత సమాజం కోసం ప్రతి ఒక్కరం కృషి చేద్దామని మండల ప్రత్యేకాధికారి ఎం ఎన్ వి రాజు పిలుపు నిచ్చారు. శనివారం మండలంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ రథం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పరిసరాల పరిశుభ్రతపై, ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ అవరణలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ అధికారులతో, కలసి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు నిత్యజీవితంగా మనందరికి ప్లాస్టిక్ ఒక వ్యసనంలా మారిందన్నారు. పూర్తిగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. దీంతో ప్లాస్టిక్ రహీత సమాజ స్థాపనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యకరంగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ డిప్యూటీ ఎంపీడీవో సులోచన, ఐటిడిపి మండల అధ్యక్షులు రమేష్ నాయక్ , పాములపాడు సర్పంచ్ కుమారుడు రాజశేఖర్,టీ.శివ శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్ లింగస్వామి,పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్, టీడీపీ నాయకులు కార్యకర్తలు తది తరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ రథాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**నేటి సాక్షి, చౌడేపల్లి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న స్వచ్ఛ రథాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో లీలా మాధవి కోరారు .స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తలపెట్టిన స్వచ్ఛరత కార్యక్రమాన్ని శనివారం ఎంపీడీవో లీలా మాధవి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛ రథం వచ్చినప్పుడు చెత్తను ఇస్తే అంత తగ్గట్టుగా నిత్యావసర వస్తువులు అందిస్తామన్నారు, ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని కోరారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మస్తాన్ ఈఓఆర్డి మహేష్ మండలంలోని కార్యదర్శులు పాల్గొన్నారు

# యూరియా అందక రోడ్డెక్కిన రైతన్న

## యాప్ వొద్దు...పాత పద్ధతిలోనే యూరియా అందించాలి



**నేటిసాక్షి, మిర్యాలగూడ (వేములపల్లి) :** ప్రభుత్వం యూరియా కావాలంటే యాప్‌లో నమోదు చేసుకుంటూనే అందజేస్తున్న నేపథ్యంలో రైతన్నలు యాప్‌పై పూర్తి అవగాహన లేక సకాలంలో యూరియా అందించక, పంట నష్టపోతున్నామని, వెంటనే యాప్‌ను రద్దు చేసి, పాత పద్దతిలోనే యూరియాను అందజేయాలని రైతులు కోరుతున్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని వేములపల్లి మండల కేంద్రంలోని నార్కెట్ పల్లి-అద్దంకి ప్రధాన రహదారిపై రైతులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే పోలీసులు రైతులతో మాట్లాడి నచ్చజెప్పడంతో వారు నిరసన విరమించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, యాప్‌తో చదువురాని రైతులు, స్మార్ట్ ఫోన్ ల్ బుకింగ్ చేసుకొనే విధానాం తెలియక పంటకు సకాలంలో అందాల్సిన యూరియా అందక దిగుబడి తగ్గిపోతుందని, బుక్ చేసుకునేందుకు యాప్ లో వొచ్చిన యూరియా స్టాక్ వొచ్చినట్లే మాయం అవుతుందని, వెంటనే యాప్ విధానం రద్దు చేసి, పాత పద్ధతిలోనే యూరియాను అందించాలని, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

# ప్రతి ఇంటికి పథకాలు చేరేలా సర్పంచుల కృషి



## సిద్దిపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా కొన్యాల బాల్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

**నేటి సాక్షి గజ్వేల్:** ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం గ్రామంలోని ప్రతి ఇంటికి చేరేలా సర్పంచులు కృషి చేయాలని కొన్యాల బాల్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర పంచాయతీ సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్న యాదవ్ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన సర్పంచుల సమావేశంలో కొన్యాల బాల్ రెడ్డిని సిద్దిపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే కార్యక్రమంలో వెంకన్న గారి వెంకట్ రెడ్డి గజ్వేల్ నియోజకవర్గ సర్పంచుల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొన్యాల బాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు నియోజకవర్గ, జిల్లా స్థాయిలో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి సిద్ధంగా ఉంటామని తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా గ్రామాభివృద్ధిలో ముందుండి పనిచేస్తామని చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు గడపగడపకు చేరేలా ప్రతి సర్పంచ్ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త నిర్వహణతో పాటు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులను సమర్థవంతంగా వినియోగించి అసంపూర్తి పనులను పూర్తి చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు జిల్లాలోని సర్పంచులకు కొన్యాల బాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అశోక్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయిని యాదగిరి, గుంటుకు శ్రీనివాస్, నక్క రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పాములపాడు విద్యుత్ అధికారులకు నిర్లక్ష్యం తగదు

## డీవీఎంసీ మెంబర్ లింగాల నాగరాజు



**నేటి సాక్షి, పాములపాడు:** పాములపాడు మండల విద్యుత్ అధికారులకు నిర్లక్ష్యం తగదని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు ఆరోపించారు ఈ సందర్భంగా డివిఎంసి మెంబర్ లింగాల.నాగరాజు మాట్లాడుతూ పాములపాడు మండల కేంద్రంలో బస్టాండు ఆవరణలో మిట్టకందాలకు వెళ్లే టర్నింగ్ దగ్గర నిరుపయోగంగా ఉన్న పాత ఇనుప స్తంభాన్ని తీసివేసి, బడి పిల్లల బస్సులకు, భారీ వాహనాలకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు. ఈ సమస్యలపై ఎన్నోసార్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రాలు సమర్పించిన విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కర్నూలు అదే మాదిరిగా ఆత్మకూరు నుండి వచ్చే వాడాల, మద్దూరు, నంద్యాల బడి పిల్లల బస్సులకు టర్నింగ్లో ఈ విద్యుత్ స్తంభం వలన ఇబ్బంది గురై, ట్రాఫిక్ కూడా సమస్యగా మారి, ఎన్నోసార్లు ప్రమాదాలు జరిగిన విద్యుత్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామాలలో రోడ్ల వెంట, పొలాలలో భూమికి నేల వాలుతున్న స్తంభాలను తొలగించకపోవడం వల్ల ప్రమాదాలకు గురై చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు వెంటనే మండల విద్యుత్ అధికారులు అప్రమత్తమై నేల వాలిన స్తంభాలను తీసివేసి, కొత్త స్తంభాలు వేయాలని ఆయన కోరారు. లేదంటే జిల్లా విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేస్తారని ఆయన హెచ్చరించారు.

# మట్టి క్రీడకు పట్టం.. కొరారిలో కబడ్డీ కేక

- యువతకు స్ఫూర్తిగా 'పోతరాజు యూత్' కబడ్డీ పోటీలు ప్రారంభించిన అజ్మీరా శ్యామ్ నాయక్

**నేటి సాక్షి, ఆసిఫాబాద్:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని కొరారి గ్రామంలో కబడ్డీ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని 'శ్రీశ్రీశ్రీ పోతరాజు యూత్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కబడ్డీ టోర్నమెంట్‌ను ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ శనివారం ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామానికి చేరుకున్న శ్యామ్ నాయక్ గారికి గ్రామస్థులు, యువత డోలు వాయిద్యాలు మరియు గిరిజన సాంప్రదాయ పద్ధతుల్లో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని, వారితో కాసేపు ముచ్చటించి వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా అజ్మీరా శ్యామ్ నాయక్ మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి గ్రామీణ క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. కబడ్డీ మన మట్టి క్రీడ అని, ఇది శారీరక దృఢత్వంతో పాటు క్రీడాకారుల్లో క్రమశిక్షణ, జట్టు భావనను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధి మరియు క్రీడాకారుల ప్రోత్సాహానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం నిర్వాహకులు శ్యామ్ నాయక్ గారిని శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, ఉప సర్పంచ్ చాహకటి ఆనంద్ రావు, గ్రామ పటేల్ మాడవి భీము, మార్కెట్ కమిటీ డైరెక్టర్ విశ్వనాథ్ పాల్గొన్నారు. అలాగే నిర్వహణ కమిటీ సభ్యులు మాడవి రాము, ఆత్రం శేఖర్, రాజు, శంకర్, భీం రావు, లక్ష్మణ్, గ్రామస్థులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# పదవ తరగతి పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి




జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**నేటి సాక్షి, జగిత్యాల బ్యూరో (రాధారపు నర్సయ్య):** వచ్చేనెల మార్చి 14వ తేదీ నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి (రాజా) పరీక్షలను ఎటువంటి లోపాలు లేకుండా నిర్వహించేందుకు జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో పూర్తి స్థాయి వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలోని ఐడిఓసి సమావేశ మందిరంలో కలెక్టర్ పర్యవేక్షణలో ఎస్ఎస్సీ విధులు నిర్వహించే సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, మండల విద్యాధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని 20మంది మండల విద్యాధికారులు, 68 మంది చీఫ్ సూపరింటెండెంట్లు (సిఎస్‌లు), 68 మంది డిపార్ట్మెంటల్ అధికారులు (డిఓలు), 8మంది కస్టోడియన్లు, 20 మంది వాహన ఇంచార్జీలు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన పదవ తరగతి పరీక్షలు పూర్తిగా పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరగాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి చరవాణులు అనుమతించకూడదని, విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఐడి కార్డు ధరించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో వసతులు కల్పించాలని పేర్కొన్నారు. కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు చేసి ప్రశాంత వాతావరణం కల్పించాలని పోలీసు శాఖకు సూచించారు. ప్రశ్నపత్రాల రవాణా, భద్రతా చర్యలు కట్టుదిట్టంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రవాణా సౌకర్యం, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. జిల్లా పరీక్షల విభాగం డైరెక్టర్ నరేందర్ మాట్లాడుతూ గత సంవత్సరాల నిబంధనలు, మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. టైమ్ టేబుల్ వివరాలు విద్యార్థులు, తల్లిదండ్రులకు స్పష్టంగా తెలియజేయాలని తెలిపారు. హాల్ టికెట్ నంబర్, ఓఎంఆర్ షీట్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పరీక్షల అనంతరం ఓఎంఆర్ షీట్లు, మిగిలిన ప్రశ్నపత్రాల భద్రపరిచే విధానం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆన్సర్ స్క్రిప్ట్‌ను మీడియం వారీగా, సబ్జెక్టు వారీగా, సెంటర్ వారీగా వర్గీకరించి బ్రౌన్ పేపర్‌తో సురక్షితంగా ప్యాక్ చేసి అన్ని వివరాలు సరిచూసుకున్న తరువాతే బట్వాడా చేయాలని తెలిపారు. సోషల్ మీడియా విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

### ఉత్తమ పాఠశాలలకు ప్రశంసలు

ఎస్ హెచ్ విఆర్ లో జిల్లాస్థాయిలో ఉత్తమ ర్యాంకింగ్ (5స్టార్ రేటింగ్) సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఇఓ రాము, జిల్లా పరీక్షల విభాగం అధికారి నరేందర్, జిల్లా కోఆర్డినేటర్లు, మండల విద్యాధికారులు, సియస్‌లు, డీఓలు, కస్టోడియన్లు, వాహన ఇంచార్జీలు తదితరులు పాల్గొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# మైక్రో ఫైనాన్స్ మాయాజాలం.. మరో ప్రాణం బలి!

### వేధింపులు భరించలేక యువకుడి ఆత్మహత్య

**నేటి సాక్షి, ఇబ్రహీంపట్నం (రాధారపు నర్సయ్య):** మైక్రో ఫైనాన్స్ అప్పుల భారం మరో కుటుంబాన్ని వీధిన పడేసింది.!వేధింపులు భరించలేక ఓ వ్యక్తి ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో కలకలం రేపింది. మండల కేంద్రానికి చెందిన లక్కం రాజశేఖర్ గత కొంతకాలంగా మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్ద అప్పులు తీసుకున్నట్లు సమాచారం. వాయిదాలు చెల్లించలేకపోవడంతో సంస్థ ప్రతినిధుల వేధింపులు తీవ్రంగా పెరిగినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అప్పుల చెల్లింపుల కోసం భార్య లత తన బంగారం కూడా కుదువపెట్టినట్లు తెలిసింది. అయినప్పటికీ వేధింపులు తగ్గకపోవడంతో కుటుంబంలో కలహాలు నెలకొన్నాయి. మైక్రో ఫైనాన్స్ ఒత్తిళ్లు మరింత పెరగడంతో భార్య లత కొంతకాలం క్రితం ఇంటిని వదిలి వెళ్లినట్లు సమాచారం. దీంతో రాజశేఖర్ తీవ్ర మనోవేదనకు



గురయ్యాడు. అప్పుల బారం, కుటుంబ విరహం కలిసి అతన్ని మానసికంగా కుంగదీసినట్లు స్థానికులు చెబుతున్నారు.

### సెల్ఫీ వీడియో తీసుకుని ఉరివేసుకుని..

అప్పుల బాధ తట్టుకోలేక రాజశేఖర్ సెల్ఫీ వీడియో తీసుకున్న తర్వాత ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటన తెలిసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### మైక్రో ఫైనాన్స్ వేధింపులపై ప్రశ్నలు

ఈ ఘటనతో మండల కేంద్రంలో ఆందోళన వ్యక్తమవుతోంది. 'వాయిదా ఆలస్యమైతే ఇంత ఒత్తిడి చేయాలా.? ప్రజలను మానసికంగా ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసం.? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థల నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఒక కుటుంబం అప్పుల మాయాజాలంలో చిక్కుకుని చిద్రమైపోయింది. అప్పు తీసుకున్నవారికి ఆర్థిక సహాయం పేరుతో ప్రారంభమైన వ్యవస్థా చివరకు ప్రాణాలనే బలి తీసుకుంటో దీనిపై సమగ్ర విచారణ అవసరమని ప్రజలు అంటున్నారు.!



# సీఎంకు మున్సిపల్ చైర్ పర్సన్ ఘనస్వాగతం

**నేటి సాక్షి, వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా కేంద్రం లో నీ అనంతగిరి లో జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం కార్యక్రమంలో పాల్గొనడానికి వికారాబాద్ విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఎస్ ఏ పి కాలేజీలోని హెలిప్యాడ్ వద్ద కలిసి పుష్ప గుచ్ఛం అందించి, స్వాగతం పలికిన వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య ఈసందర్భంగా రాష్ట్రంలో పిన్న వయస్సులోనే మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన గడ్డం అనన్య కు శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి వికారాబాద్ పురపాలక సంఘం పరిధిలో అభివృద్ధి పనులకు ప్రత్యేకంగా నిధులను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి గారికి వినతిపత్రం అందజేసిన చైర్ పర్సన్ గడ్డం అనన్య కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**నేటి సాక్షి, చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన దేశబోయినకాశయ్య ఈనెల 19వ తారీకున నేరేడుచర్ల పట్టణంలో బస్టాండ్ నుండి జాన్దీర్ షోరూమ్ కు నడుచుకుంటూ వెళ్తుండగా అశోక్ లేలాండ్ బండి వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో తలకు తీవ్రగాయాలు కావడంతో వెంటనే మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు అక్కడి నుండి హైదరాబాదు తరలించగా శనివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కాశయ్య మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుము కున్నాయి. గ్రామంలో నలుగురితో కలుపుగోలుగా తిరిగే కాశయ్య అకాల మరణం చెందడంతో స్నేహితులు బంధువులు ఆవేదనకు గురయ్యారు.

# ముగిసిన సర్పంచ్‌ల శిక్షణ




**నేటిసాక్షి, తిరుమలాయపాలెం (మెట్టు రుద్రరాజు):** డిపిఆర్‌సి భవనం ఖమ్మంలో నూతన సర్పంచ్‌ల కోసం నిర్వహించిన ఐదు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం శనివారంతో విజయవంతంగా ముగిసింది. గ్రామ అభివృద్ధి, పారదర్శక పాలన, పథకాల అమలు, వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. చివర రోజు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అనుదీప్ దిరిశెట్టి ముఖ్య అతిథిగా హాజరై సర్పంచ్ ల సూచనలు సలహాలు అందించారు. గ్రామస్థాయిలో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు సర్పంచ్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రభుత్వ పథకాల పారదర్శకంగా అమలు చేయాలని ఆయన సూచించారు. ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు గ్రామ సభలను సమర్ధవంతంగా నిర్వహించాలని సూచనలు చేసినారు. ఈ ఐదు రోజుల శిక్షణలో గ్రామపంచాయతీ చట్టాలు నిధుల వినియోగ విధానం అభివృద్ధి పనుల ప్రణాళిక స్వచ్ఛత కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణ డిజిటల్ రికార్డు నిర్వహణ అంటే అంశాలపై నిపుణులు వివరించారు. సర్పంచులు తమ గ్రామాల్లో ఎదురయ్యే సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలు తెలుసుకున్నారు శిక్షణ అనంతరం జిల్లా కలెక్టర్ నూతన సర్పంచ్ లకు సర్టిఫికెట్ అందజేశారు ఈ కార్యక్రమం ద్వారా గ్రామపంచాయతీ సర్పంచ్ ల బాధ్యత భావం, పరిపాలన నైపుణ్యాలు మరింత పెరగని అధికారులు తెలిపారు. గ్రామ అభివృద్ధి పట్ల సర్పంచులు మరింత చైతన్యంతో ముందుకు సాగాలని,ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని అధికారులు ఆకాంక్షించారు. ఈ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం గ్రామ పాలనలో నాణ్యతను పెంపొందించడంలో కీలకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు, అన్ని మండల అధికారులు పాల్గొన్నారు.

# పరారీలో ఉన్న దొంగ అరెస్ట్



**నేటిసాక్షి, తిరుమలాయపాలెం (మెట్టు రుద్రరాజు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో గత ఆరు నెలలుగా జరుగుతున్న మోటర్ల దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలను ఫిబ్రవరి మూడవ తారీకు వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డ ముగ్గురిలో ఒకరు పారిపోగా పరారీలో ఉన్న గుగులోత్ నవీన్ (s/oవీరన్న)ను ఈరోజు బచ్చోడు తండాలో తన ఇంట్లో ఉండగా అరెస్టు చేసిన తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్. నిందితుడి వద్ద ఉన్న నాలుగు కరెంట్ మోటర్లను స్వాధీన పరచుకొని రిమాండ్ నిమిత్తం కోర్ట్ నందు హాజరు పరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కూచిపూడి జగదీష్ సిబ్బంది పాల్గొన్నారు.

# 'గుండె'నెందుకిచ్చావురా దేవుడా.!?

## 'హార్ట్ సర్జరీ' తర్వాత నాలుగు రోజుల్లోనే యువకుడి మృతి

భార్యకు ఒంటరితనం, కుటుంబానికి అప్పుల భారం

కోరుట్ల 22వ వార్డులో ఒకే వారంలో ముగ్గురు 'హార్ట్ ఎటాక్'తో మృతి



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** 'గుండె'నెందుకిచ్చావురా దేవుడా..? ఎండమావిని చేశావురా..దేవుడా..? అమృతమంటి ప్రేమని కురిపిస్తావూ..మరు నిమిషంలో విషంగా మరిగిస్తావూ..' అంటూ ఓ సినిమాలో గుండెల్ని పిండెసే విషాదగీతమది.! సరిగ్గా..ప్రతీ మనిషికి దేవుడు 'గుండె'ను ఇచ్చాడూ కానీ దాన్ని కాపాడుకునే శక్తిని ఇవ్వలేదు.!

### రాంనగర్‌లో.. విషాదం.!

కోరుట్ల పట్టణంలోని బాలాజీ రోడ్ రాంనగర్.. ఈ చిరునామా ఇప్పుడు విషాదానికి చిరునామాగా మారింది. దురిశెట్టి నాగరాజు (33) ఒక సాధారణ పేద యువకుడు. తన భార్యతో కలిసి జీవితాన్ని నడిపించుకుంటున్నాడు. ఆయనకు హఠాత్తుగా గుండె నొప్పి రావడంతో హుటాహుటిన హైదరాబాద్ తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ఆయనకు 'గ్లోబల్ హాస్పిటల్'లో సర్జరీ చేశారు. ఏం జరిగిందో తెలీదు కానీ..నాలుగు రోజుల తర్వాత ఆయన మృతిచెందినట్టు హాస్పిటల్ వర్గాలు చెప్పి మృతదేహాన్ని కోరుట్లకు పంపించేశారు. ఈ ఘటన స్థానికంగా విషాదం నింపింది.

### ఒకే వార్డులో వారంలో మూడు..

నాగరాజుకు పిల్లలు లేకపోవడం వల్ల వచ్చిన ఒత్తిడా.? లేక మరేదైనా కారణమా.? అది ఎవరికీ తెలియదు. కానీ, ఆయన జీవితం ఇప్పుడు ఒక దారుణమైన ముగింపును చూసింది. హైదరాబాద్‌లోని గ్లోబల్ హాస్పిటల్‌లో 'హార్ట్ సర్జరీ'చేసుకున్న నాలుగు రోజుల తర్వాత, ఆయన ఈ ప్రపంచాన్ని వదిలి వెళ్లిపోయాడు. సొంత ఇంటికి తీసుకువచ్చిన శవాన్ని చూసి, కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. నాగరాజు ఒక సామాన్యుడు. పేదరికంలో పుట్టి, కష్టపడి జీవితాన్ని నడిపించుకుంటున్నాడు. అతని భార్యకు ఆయనే ఆధారం. పిల్లలు లేకపోవడం వల్ల వచ్చిన మానసిక ఒత్తిడి, బహుశా ఆరోగ్య సమస్యలు.. ఇవన్నీ కలిసి హార్ట్ అటాక్‌కు దారితీశాయేమో.? సర్జరీ చేసుకున్నాక కూడా ఆయన బ్రతకలేదు. ఇప్పుడు ఆమె ఒంటరి. పిల్లలు లేరు, భర్త లేడు, కానీ రూ.8 లక్షల అప్పులు మాత్రం మిగిలాయి. ఆపరేషన్ కోసం తీసుకున్న అప్పులు ఆమె మెడకు తాడులా మారాయి. ఎవరు ఆదుకుంటారు? ఎలా జీవిస్తుంది? ఈ ప్రశ్నలు గుండెల్ని పిండేస్తున్నాయి. ఇది కేవలం ఒక కుటుంబం యొక్క కథ మాత్రమే కాదు. 22వ వార్డులో ఒక వారంలో ముగ్గురు వ్యక్తులు హార్ట్ అటాక్‌తో చనిపోయారు. సోరూపక కొమరయ్య, ఇందూరు శ్రీనివాస్, మరియు దురిశెట్టి నాగరాజు... ముగ్గురూ ఒకే వారంలో ఈ దారుణమైన మరణాన్ని చవిచూశారు. వార్డు సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు.

### 22వ వార్డులో అసలు ఏం జరుగుతోంది.?

ఈ ప్రాంతంలో హార్ట్ సమస్యలు ఎందుకు పెరిగిపోతున్నాయి.? ఒత్తిడి, పోషకాహార లోపం, పర్యావరణ కాలుష్యం, లేదా మరేదైనా.? ఇవన్నీ ప్రశ్నలు. కానీ, జవాబులు లేకుండా, కుటుంబాలు నాశనమవుతున్నాయి. మానవీయ కోణంలో చూస్తే, ఇది కేవలం ఒక మరణం కాదు ఉ ఒక కుటుంబం యొక్క భవిష్యత్తు నాశనం. నాగరాజు భార్య ఇప్పుడు ఎలా జీవిస్తుంది? పిల్లలు లేకుండా, ఆర్థిక సమస్యలతో... ఆమె ముఖంలోని దుఃఖం, కళ్లలోని శూన్యం ఉ ఇవి గుండెలు పగిలేట్టు చేస్తాయి. "ఓరి దేవుడా, ఇదేం న్యాయం?.. నువు మనిషిగా పుట్టి చూడు, నీకు హార్ట్ అటాక్ వస్తే నీ భార్య పరిస్థితి ఏమిటి.? నీపై ఆధారపడిన కుటుంబం ఏమవుతుంది.? అని రోదిస్తున్న ఆ కుటుంబం సంధించిన ఈ ప్రశ్నలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే ఈ కుటుంబాన్ని ఆదుకోవాలి. వార్డు ప్రజలు కోరుతున్నట్లుగా, ఆర్థిక సాయం, మానసిక మద్దతు అందించాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, హార్ట్ హెల్త్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఇది కేవలం ఒక కథ కాదు ఉ మన సమాజంలోని పేదల దుర్గతి యొక్క ప్రతిబింబం. ఈ విషాదం మనల్ని మానవత్వాన్ని గుర్తుచేస్తుంది, మరియు మనం ఒకరినొకరు ఆదుకోవాలని బోధిస్తుంది.!

# జోగిన్‌పల్లిలో కత్తిపోట్ల కలకలం

## మహిళకు తీవ్ర గాయాలు-నిందితుడు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

**నేటి సాక్షి కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల మండలంలోని జోగిన్ పల్లి గ్రామంలో పాత కక్షలు మరోసారి రగిలి శుక్రవారం హత్యాయత్నానికి దారి తీసింది. గ్రామానికి చెందిన నల్ల నవీన్ అనే వ్యక్తి, అదే గ్రామానికి చెందిన ముక్కెర గంగారెడ్డిపై దాడికి పాల్పడ్డాడు. గ్రామంలో గత కొంతకాలంగా ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నట్లు సమాచారం.

### కత్తిపోట్ల ఘటనతో ఊళ్లో ఉద్రిక్తత

శుక్రవారం సాయంత్రం సుమారు 5.30 గంటల సమయంలో ముక్కెర గంగారెడ్డి ఒంటరిగా ఉన్నాడని గమనించిన నల్ల నవీన్ అతనిపై చేతులతో దాడి చేసినట్లు తెలిసింది. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. సాయంత్రం జరిగిన దాడితో ఆగకుండా, ముక్కెర గంగారెడ్డిని ఎలాగైనా హతమార్చాలనే ఉద్దేశంతో నల్ల నవీన్ రాత్రి సుమారు 9 గంటల సమయంలో ముందస్తుగా తెచ్చుకున్న కత్తితో అతని ఇంటికి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అయితే, ఆ సమయంలో గంగారెడ్డి ఇంట్లో లేకపోవడంతో పరిస్థితి విషమించింది. ఇంట్లో ఉన్న గంగారెడ్డి తల్లి ముక్కెర వెంకటరాజు నిందితుడిని కత్తితో ఎందుకు వచ్చావని ప్రశ్నించగా, ఆగ్రహానికి గురైన నల్ల నవీన్ ఆమెపై కత్తితో దాడి చేసినట్లు సమాచారం.

### మహిళకు తీవ్ర గాయాలు-అరెస్ట్

ఈ దాడిలో ముక్కెర వెంకటరాజుకు తలకు, ఎడమ చేయికి, ఎడమ కాలుకు తీవ్రమైన రక్త గాయాలు అయ్యాయి. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. గ్రామస్తులు ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, గ్రామంలో శాంతి భద్రతలు కట్టుదిట్టం చేయాలని పోలీసులను కోరారు. గాయపడిన మహిళ కుమారుడు ముక్కెర గంగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు నల్ల నవీన్‌ను అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనతో జోగిన్ పల్లి గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, పోలీసులు గ్రామంలో పహారా పెంచినట్లు తెలిపారు. పాత కక్షలు ప్రాణాంతక ఘటనలకు దారి తీస్తున్న నేపథ్యంలో గ్రామస్తులు సామరస్యంతో ఉండాలని ఎస్ఐ చిరంజీవి సూచించారు.



# గోకులం షెడ్లతో రైతుకు ప్రయోజనం

## ఎమ్మెల్యే గిత్త జయసూర్య.

**నేటి సాక్షి, బన్నూరు :** జూపాడుబంగ్లా మండలం 80బన్నూరు గ్రామంలో నూతనంగా సిసి రోడ్డు భూమి పూజ కార్యక్రమం జూపాడుబంగ్లా ఎంపిడిఓ. గోపీకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య వారికి స్వాగతం పలికి బొక్కే ఇచ్చి పూలమాలలతో శాలువాలతో ఎమ్మెల్యే గారికి ఎంపిడిఓ గోపీకృష్ణ సన్మానం చేయడం జరిగింది. తర్వాత బన్నూరు గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించడం జరిగింది . ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందరికీ అందుబాటులో ఉండే ప్రభుత్వం.. ఇది పేదల ప్రభుత్వం. వాడ వాడ కి ప్రజలకు రోడ్లు మరియు సి సి రోడ్డు గోకులం సెడ్డు లు అందరికీ ఉపయోగము పడే విధంగా మన రాష్ట ప్రభుత్వం మంచి మంచి కార్యక్రమాలు చేపడుతుంది. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుల సంక్షేమం, పాడి పశువుల అబివృద్ధి, కోసం రాయితీ కింద చేపట్టిన గోకులం సెడ్డు లను సుమారు 2 లక్షల రూపాయలు తో టీడీపీ నాయకులతో కలిసి ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు పాల్గొనడం జరిగింది.



# మృతుల కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వ విప్





**నేటి సాక్షి, మేడిపల్లి:** మేడిపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయితీలో పారిశుద్ధ్య కార్మికునిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న చెప్యాల లక్ష్మణ్ ఈ నెల బుధవారం 18 వ తేది రోజున మరణించడం జరిగింది. రెండు నెలల క్రితం మరణించిన ఎమ్మార్పిఎస్ మండల అధ్యక్షులు ధోనిపాల శంకర్ తండ్రి ధోనిపాల గంగారాజం అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకుని బాధిత కుటుంబాలని పరామర్శిం చిన వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడిపల్లి మండల అధ్యక్షులు ఏనుగు రమేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ యాదవ్,మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, మాజీ జెడ్పిటిసి కుందారపు జలంధర్, మాజీ ఎంపిపి మకిలి ఇజ్రాయిల్, మాజీ సర్పంచ్ లు బొంగోని రాజ గౌడ్, ఉరుమడ్ల నర్సయ్య,మాజీ ఎంపిటిసి దాసరి శంకర్, మాజీ ఉపసర్పంచ్ మార్గం నర్సారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బలగం రాజేష్,మాజీ సర్పంచులు ఎంపిటిసిలు మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

# నూతన సంత కొరకు కరపత్రాలు పంపిణీ



**నేటి సాక్షి, తిరుమలయపాలెం (మెట్టు రుద్రరాజు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం సుబ్లేడ్ గ్రామంలో 24వ తారీఖున నూతనంగా ఏర్పాటు చేయబోయే సంత కోసం కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రామ సహాయం నరేష్ రెడ్డి ఆదేశాల మేరకు పిండిప్రోలు గ్రామంలో సంత సందర్భంగా వారికి కరపత్రాలను పంచుతూ ఆహ్వానించిన సుబ్లేడ్ గ్రామ సర్పంచ్ సంగబత్తుల స్వాతి సుమన్ రెడ్డి ఉప సర్పంచ్ భూక్య కనిల్ కుమార్ . ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్య వీరన్న మాజీ ఉపసర్పంచ్ బత్తుల వెంకటనారాయణ వార్డ్ మెంబర్స్ గంధసిరి శ్రీనివాస్ గండమల్ల అభిలాష్ బండారు రాంబాబు భూక్య అచ్చమ్మ సతీష్ పోలే పొంగు ముత్తయ్య గండమల్ల పద్మ సూరయ్య గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# గాయత్రి బ్యాంక్ బ్రాంచ్ వార్షికోత్సవం

**నేటి సాక్షి, జగిత్యాల ప్రతినిధి (గుండ ప్రశాంత్ గౌడ్):** గొల్లపల్లి గాయత్రి బ్యాంక్ బ్రాంచ్ 21.02.2026 నాటికి విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకుంది. ఈ ఒక సంవత్సర కాలంలో బ్రాంచ్ విశేష అభివృద్ధిని సాధించింది. మొత్తం డిపాజిట్లు రూ.10.89 కోట్లు అడ్వాన్సులు రూ.11.33 కోట్లు నమోదు చేసి, మొత్తం వ్యాపారం రూ.22.22 కోట్లకు చేరుకుంది. ఈ విజయోత్సవ కార్యక్రమంలో ూా+వీ బి తిరుపతి ూాదీవీ దర్శన్, బ్రాంచ్ హెడ్ నేరెళ్ల మునిందర్ సిబ్బంది మరియు కస్టమర్లు మోహన్ రెడ్డి, కిషన్, లింబాద్రి, గంగాధర్, రవీందర్, శ్రవణ్, చరణ్, రాము కిరణ్ ఉత్సాహంగా పాల్గొన్నారు. కస్టమర్ల విశ్వాసం మరియు సహకారం వల్లే ఈ స్థాయి విజయాన్ని సాధించగలిగింది. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలను అందిస్తూ ప్రాంతీయ ప్రజల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని బ్యాంక్ ప్రతినిధులు తెలిపారు.



# వివిధ ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయండి

## అధికారులకు కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశం..

**నేటి సాక్షి, కరీంనగర్:** జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేసి త్వరగా పూర్తి పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. భూసేకరణ విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. శనివారం సాయంత్రం కరీంనగర్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కరీంనగర్ హుజురాబాద్ ఆర్డీవోలు, భూసేకరణ, ఇరిగేషన్ అధికారులతో జిల్లాలోని వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఇందిరమ్మ వరద కాలువ, మిడ్ మానేరు రిజర్వాయర్, మోతే ప్రాజెక్టు కెనాల్స్, గౌరవెల్లి రిజర్వాయర్ కెనాల్సు చొక్కా రావు ఎత్తిపోతల పథకం పనులు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అదనపు పనులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియపై పూర్తిస్థాయిలో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన పనుల పురోగతి భూ సేకరణ ఎంతవరకు పూర్తయింది.. అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ పనుల పురోగతి స్పీడ్ అప్ చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని వాటి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. భూ సేకరణ ప్రక్రియ త్వరగా చేపట్టి ప్రాజెక్టుల పనులు సజావుగా సాగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. భూసేకరణ విషయంలో జాప్యం ఎక్కడా జరగకుండా త్వరగా చర్యలు తీసుకొని ప్రక్రియను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# హస్నాబాద్ గ్రామపంచాయతీ నీటి సరఫరా పైప్‌లైన్ మరమ్మత్తులు



**నేటిసాక్షి, తిరుమలాయపాలెం (మెట్టు రుద్రరాజు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్ గ్రామపంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో ఇటీవల దెబ్బతిన్న తాగునీటి సరఫరా పైప్‌లైన్ మరమ్మత్తుల పనులను సర్పంచ్ కొవ్వూరి పద్మా సత్తిరెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామ ప్రజలకు అంతరాయం లేకుండా శుద్ధమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో పనులు వేగవంతం చేయాలని సంబంధిత సిబ్బందికి ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి నర్మదా హాజరై, పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. పైప్‌లైన్ లీకేజీలను పూర్తిగా నివారించి, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో నీటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం కోసం గ్రామపంచాయతీ కట్టుబడి ఉందని సర్పంచ్ తెలిపారు. ప్రజల సహకారంతో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేస్తామని పేర్కొన్నారు.

# జాతీయ సైన్స్ దినోత్సవం నేపథ్యంలో విద్యార్థులకు పోటీలు



**నేటి సాక్షి ప్రతినిధి, చందుర్తి :** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ పురస్కరించుకొని విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు తిరుపతి తెలిపారు. శనివారం పాఠశాలలో జాతీయ సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన పోటీలలో ఉత్తమ పతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. మానాల పాఠశాలల చెందిన విద్యార్థులు ఈ ప్రతిభ పోటీలలో పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి బహుమతి డి . లాస్యప్రియ, ద్వితీయ బహుమతి బి. సాహిత్, తృతీయ బహుమతి బి. అయాన్ అద్విత్ లకు గ్రామ ఉప సర్పంచ్ దాసరి అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ దాసరి అశోక్ మాట్లాడుతూ... మానాల పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని. మండల, జిల్లా స్థాయిలో గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన అక్షించారు.


UAE JOBS 2026 - Earn 1.2 lakhs & More
noon FOOD
talabat
careem
keeta
amazon
Hurry up!!! Exciting Opportunity for Indian Freshers
BIKE RIDERS
Sal: 1,25,000/- Approx
"The more you work hard, The more you earn"
AED 4500 - 6000
SALARY + COMMISSION + INCENTIVES + TIPS
Walk-In Interview on 26th Febuary 2026 - Thursday
Earning Potential 1,50,000/-
International 2 WHEELER License
Visa Sponsorship, 2years & Renewable
Helmet, Sim card & Safety Kit
Accommodation until License
Medical, Car Insurance & Maintenance
AGE Limit 21 - 45
APPLY NOW : 7730077740 / 7730077750
THE JOB EXPO INDIA
"We are your source of Livelihood - Hum apke rozgaar ka zariya hai"
Employment Experts Since 2002
TJE
THE JOB EXPO
WhatsApp 7730047770
Call 7730017778
Address: #504, S.G.M Mall, Above HDFC Bank, OPP Pillar NO. 14, Mehdipatnam , Hyderabad
'THE JOB EXPO INDIA PROVIDE Guidance to unemplyed indians & assistance to INDIA GOVERNMENT LICENCE HOLDERS.